Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 16 మేడ్చల్ మల్కాజ్‌గిరి 9 ఫిబ్రవరి 2024 శుక్రవారం పేజీలు : 4

## నేను అవినీతికి పాల్పడలేదు : కేజ్రీవాల్

ఢిల్లీ : ఈడీ సమన్లు పంపడంపై ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మరోసారి మండిపడ్డారు. తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని తెలిపారు. ఆయన ఢిల్లీలో మాట్లాడుతూ.. "బీజేపీ కక్షరాజకీయాలకు ఈడీని వాడుకుంటోంది. ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు లోక్ సభ ఎన్నికల్లో ప్రచారం చేయకుండా ఆపాలని బీజేపీ చూస్తోంది. మద్యం కుంభకోణం కేసులో అవినీతి జరగలేదన్నది నిజం. బీజేపీ నన్ను అరెస్ట్ చేయాలని చూస్తోంది. నా పెద్ద ఆస్తి నిజాయతీ. దాన్ని తగ్గించాలని వారు అనుకుంటున్నారు. కానీ అలా ఎప్పటికీ చేయలేరు. నాకు పంపిన సమన్లు చట్ట విరుద్ధమని లాయర్లు నాకు చెప్పారు. విచారణ పేరుతో నన్ను ఇబ్బందిపెట్టి లోక్ సభ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించకుండా చేయాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది" అని అన్నారు.



# 'హామీల అమలులో రాజీలేదు'

## గ్యారెంటీల అమలు పై గవర్నర్ తమిళసై కీలక వ్యాఖ్యలు..!!



హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. గవర్నర్ తమిళసై సమావేశాలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వం గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉందని స్పష్టం చేసారు. కాళోజీ కవితతో తెలుగులో ప్రసంగం ప్రారంభించిన గవర్నర్ తెలంగాణ ప్రజలు ప్రజాస్వామ్యం కోసం పోరాడారన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కంచెను తొలగించారన్నారు. దీంతో ప్రజలు తమ సమస్యలు చెప్పుకునే అవకాశం వచ్చిందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలు : అసెంబ్లీ తొలి రోజు సమావేశానికి ప్రతిపక్ష నేత కేసీఆర్ గైర్హాజరయ్యారు. గవర్నర్ తన ప్రసంగంలో ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. హామీ ఇచ్చిన విధంగా ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరతామని స్పష్టం చేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించామన్నారు. అర్హులైన వారికి రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ అందజేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆరు గ్యారెంటీల్లో రెండు గ్యారెంటీలు అమలు చేశామన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతోందన్నారు. త్వరలో మరో రెండు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తిచేస్తామన్నారు. యువతకు 2 లక్షల ఉద్యోగుల కల్పనపై దృష్టిపెట్టామన్నారు.

**హామీలు అమలు చేస్తాం :** ప్రజావాణిలో 1.8కోట్ల దరఖాస్తులు వచ్చాయన్నారు. రైతులు, యువత, మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తామని చెప్పుకొచ్చారు. మౌలిక వసతులరంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలపై పన్నుల భారం పడకుండా చూస్తామన్నారు. గత సమావేశాల్లో ఆర్థిక పరిస్థితులపై శ్వేతపత్రం విడుదల చేశామన్నారు. ప్రతి ఇంటికి ఇంటర్నెట్ అందిస్తామని గవర్నర్ తమిళిసై వెల్లడించారు. దేశ ఏఐ క్యాపిటల్ గా హైదరాబాద్ ను అభివృద్ధి చేస్తామని చెప్పుకొచ్చారు. టీఎస్ పీఎస్సీని ప్రక్షాళన చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో 10 నుంచి 12 ఫార్మా విలేజ్ లు ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రానికి కొత్తగా రూ. 40 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని గవర్నర్ వివరించారు. ప్రజాపాలన కొనసాగుతుంది : ప్రజలపై పన్నుల భారం పడకుండా చూస్తామని గవర్నర్ చెప్పుకొచ్చారు. గత అసెంబ్లీ సమావేశాల్లో ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేశామని గుర్తు చేసారు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా కొత్త పారిశ్రామిక విధానం, మౌలిక వసతుల రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే చిన్న పరిశ్రమల అభివృద్ధి కోసం కొత్త ఎంఎస్ఎంఈ విధానాన్ని కూడా అమలులోకి తీసుకొస్తామన్నారు. గత ప్రభుత్వం వైఫల్యాలను ప్రస్తావించారు. ప్రస్తుత ప్రభుత్వం లక్ష్యాలను వివరించిన గవర్నర్.. ప్రధానంగా ప్రజలు కోరుకున్న విధంగా పాలన ఉంటుందని స్పష్టం చేసారు. రేపు సభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానం పై చర్చ జరగనుంది. 10న ఓట్ ఆన్ ఎకౌంట్ బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు.

# మరో 4 బీఆర్ఎస్ ఎంపీలూ జంప్?

## ముఖ్య నేత జిల్లా నుంచి?

సరిగ్గా చెప్పాలంటే లోక్ సభ ఎన్నికలు మూడు నెలలు మాత్రమే ఉన్నాయి. 2019లో ఏప్రిల్ 11న తెలుగు రాష్ట్రాల్లో పార్లమెంటు ఎన్నికల పోలింగ్ జరిగింది.

ఈసారి కాస్త ముందుగానే జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. అంటే.. మూడు నెలల్లోపే ఎన్నికలు జరగొచ్చు. దీంతోనే రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఇప్పటికే ప్రతిపక్ష బీఆర్ఎస్ నుంచి పెద్దపల్లికి చెందిన ఎంపీ వెంకటేశ్ నేత కాంగ్రెస్ లోకి వెళ్లిపోయారు.

**ఇంకెందరు? :** తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి సరిగ్గా రెండు నెలలు. అయితే, ఎమ్మెల్యేలు ఎవరూ ఇప్పటికి ప్రతిపక్షాన్ని వీడి అధికార పక్షంలోకి చేరలే దు. అయితే, మంగళవారం అనూహ్యంగా వెంకటేశ్ నేత కాంగ్రెస్ లోకి చేరిపోయారు. ఎమ్మెల్యే చేరడం అంటే.. ఒక నియోజకవర్గ పరిధే. అదే ఎంపీ అంటే 6-7 నియోజకవర్గాల పరిధి. కాగా, వెంకటేశ్ నేత తరహాలో మరికొందరు బీఆర్ఎస్ ఎంపీలూ కాంగ్రెస్ లోకి వెళ్తారనే ప్రచారం జరుగుతోంది.

**9 మందిలో ఒకరు ఔట్? మిగతా నలుగురు? :** గత ఎన్నికల్లో బీఆర్ఎస్ 9 ఎంపీ సీట్లు నెగ్గింది. కాంగ్రెస్ మూడు, బీజేపీ నాలుగు, ఎంఐఎం ఒకటి గెలిచాయి. బీఆర్ఎస్ 9 మంది ఎంపీల్లో వెంకటేశ్ నేత వెళ్లిపోగా.. 8 మంది మిగిలారు. అయితే ,ఇంకో నలుగురూ ఇదే బాటన ఉన్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరీ ముఖ్యంగా తెలంగాణ ముఖ్య నేత సొంత జిల్లాకు చెందిన ఎంపీ జంప్ జిలానీల జాబితాలో ముందున్నట్లుగా తెలుస్తోంది.

ఆయన అత్యంత సమీప బంధువు ఇప్పటికే కాంగ్రెస్ లో చేరడమే దీనికి నిదర్శనంగా పేర్కొంటున్నారు. ఇక మిగతా ముగ్గురు ఎవరనే ప్రశ్న వస్తోంది.

**ఆయన ఉంటారా? వెళ్తారా? :** తెలంగాణలో గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు కొరుకుడు పడని జిల్లాకు చెందిన ఎంపీ కూడా ఆ పార్టీని వీడే చాన్సుందని చెబుతున్నారు. ఆయన అభ్యర్థిత్వం ఖరారైనప్పటికీ.. జిల్లాలో బీఆర్ఎస్ కు అసలు నాయకత్వమే లేకపోవడంతో ఎన్నికల్లో పోటీ చేసినా ఓటమి తప్పదని భావిస్తున్నట్లు సమాచారం. అందులోనూ ఆ జిల్లానుంచి ముగ్గురు నాయకులు పెద్ద పదవుల్లో ఉండడంతో ఎంపీకి రాజకీయంగా ఊపిరాడడం లేదు. గత ఎన్నికల సమయంలో ఆయన పార్టీ మారి బీఆర్ఎస్ లోకి వచ్చారు. ఇక మిగిలిన ఇద్దరిలో ఒకరు హైదరాబాద్ పరిసర ప్రాంత ఎంపీ అని కథనాలు వస్తున్నాయి. మరి వీటిలో ఏ ఊహాగానం నిజం అవుతుందో?

## అలా చేయడం లీడర్ ఆఫ్ అపోజిషన్‌ను అవమానించడమే



హైదరాబాద్, ఫిబ్రవరి 8: అసెంబ్లీలో ఎల్‌వోపీ కార్యాలయం మార్పుపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీలో లీడర్ ఆఫ్ అపోజిషన్‌కు చిన్న ఛాంబర్ ఇవ్వడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఈ అంశంపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఈరోజు బీఆర్ఎస్ పార్టీకి చెందిన 39 ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి స్పీకర్‌ను కలిశామని.. అసెంబ్లీలో లీడర్ ఆఫ్ అపోజిషన్‌కు చిన్న ఛాంబర్ ఇవ్వడం అవమానించడమే అని అన్నారు. "స్పీకర్ కావాలని అడగడంతో ఎల్‌వోపీ ఇచ్చాం. స్పీకర్ మీద గౌరవంతో ఇవ్వడం జరిగింది. మా ఎల్‌వోపీకి అంతే పెద్ద ఛాంబర్ ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ చిన్న గదిని కేటాయించారు అది కరెక్ట్ కాదు. ఇప్పటి వరకు వాడుతున్న ఎల్‌వోపీ రూమ్‌ను మీ సౌకర్యం కోసం ఇవ్వడానికి ఒప్పుకున్నారు కేసీఆర్.

కాంగ్రెస్ పార్టీ సభ్యులు ఐదుగురు ఉన్నప్పుడు కూడా మేము ఎల్‌వోపీ రూమ్ ఇచ్చాం. పెద్ద ఛాంబర్ కేటాయించాలని స్పీకర్‌ను కోరాము" అని తెలిపారు.

## కేసీఆర్‌కు అహంకారం ఇంకా తగ్గలేదు...



న్యూఢిల్లీ : అధికారం పోయినా కేసీఆర్‌కు అహంకారం తగ్గలేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీహెచ్ మాట్లాడుతూ.. నల్గొండలో కేసీఆర్ భారీ బహిరంగ సభతో ప్రజలలోకి వెళుతున్నారని.. గత పదేళ్లలో కేసీఆర్ ఏనాడైనా ప్రజలలోకి వెళ్లాడా? అని ప్రశ్నించారు. కేసీఆర్ ఉంటే ప్రగతిభవన్‌లో లేదా ఫాంహౌజ్‌లో ఉండేవారని అన్నారు. కాళేశ్వరం, మేడిగడ్డలో కేసీఆర్ సర్కారు అవినీతి భాగోతం బయటపడుతుందనే కృష్ణా జలాలపై కేసీఆర్ మాట్లాడుతూ ప్రజల దృష్టిని దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజలలో పెరుగుతున్న ఆదరణతో ఓర్వలేక ఫ్రస్టేషన్‌తో సీఎం రేవంత్ దిష్టిబొమ్మలు తగలబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎస్ సోమేషకుమార్ అవినీతి బాగోతంపై దర్యాప్తు జరిపిస్తామని వీహెచ్ అన్నారు.




# గుడ్ న్యూస్..

## ఉచిత కరెంట్ పథకంపై కీలక అప్ డేట్

## ఇలా చేస్తేనే కరెంటు ఫ్రీ..!

హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా అడుగులు వేస్తుంది. ఇప్పటివరకు రెండు పథకాలను అమలు చేశారు. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యంతో పాటు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద 10 లక్షల భీమాను కల్పించారు.

మిగిలిన పథకాల అమలుపై దృష్టి పెట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా పాలన దరఖాస్తులను స్వీకరించింది. ఆరోగ్యానికి ఒకే ఫారాన్ని తీసుకొచ్చి ప్రతి గ్రామంలో ప్రజా పాలన ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. అందరి నుంచి దరఖాస్తులను స్వీకరించింది. ఈ దరఖాస్తులను డీజిలైజ్ చేసిన తర్వాత క్షేత్రస్థాయిలో అధికారులు ఇంటింటికి వెళ్లి దరఖాస్తుదారుల వివరాలను తీసుకుంటారు. లబ్ధిదారుల ఎంపిక తర్వాత మహిళలకు నెలకు రూ.2500, రూ.500 కే గ్యాస్ సిలిండర్, ఉచిత కరెంటు వంటి పథకాలను అమలు చేస్తారు. అయితే ఇందులో ఉచిత కరెంటు పథకానికి సంబంధించి కీలక వివరాలు బయటకు వచ్చాయి.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇస్తామని తమ మేనిఫెస్టోలో కాంగ్రెస్ తెలిపింది. ఈ నేపథ్యంలో త్వరలోనే ఈ పథకం అమలుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అయితే ఈ ఉచిత కరెంటు పథకం వర్తించాలంటే బకాయిలు ఉండకూడదు అని అధికారులు చెబుతున్నారు. వీలైనంత త్వరగా పెండింగ్ బిల్లులను క్లియర్ చేసుకోవాలని సూచిస్తున్నారు.

ప్రభుత్వం వచ్చిన వెంటనే ఈ పథకాన్ని అమలు చేస్తామని చెప్పడంతో చాలామంది డిసెంబర్, జనవరి బిల్లులు కట్టలేదు. వారంతా పెండింగ్ బిల్లులను కట్టాల్సిందేనని అధికారులు స్పష్టం చేశారు. ఎలాంటి బకాయిలు లేని వారికి ఉచిత కరెంట్ వస్తుందని చెబుతున్నారు. అయితే ప్రభుత్వం ఇప్పటికే హామీ ఇచ్చినందున డిసెంబర్, జనవరి బిల్లులను మాఫీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఉచిత కరెంటు పథకానికి సంబంధించి ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. ప్రజా పాలన దరఖాస్తులు ఎన్ని యూనిట్ల కరెంటు వాడుతారు..మీటర్ కనెక్షన్ నెంబర్ ఎంత..అనే వివరాలు మాత్రమే అడిగారు. గైడ్ లైన్స్ వచ్చిన తర్వాతే మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తుంది.

# సంపాదకీయం

## భారతీయ నౌకలను ఎందుకు హైజాక్ చేస్తున్నారు?

గతంలో విమానాల హైజాక్ లు ఎక్కువగా జరిగేవి. ప్రస్తుతం నౌకల హైజాక్ లు చోటుచేసుకుంటున్నాయి. నాగరికత పెరిగిన తరువాత మోసాలు కూడా పెరుగుతున్నాయి. ఎదుటి వారిని దోచుకోవడం ఓ అలవాటుగా చేసుకున్నారు. మన నౌకలను టార్గెట్ చేసుకుని హైజాక్ డ్రామాలు ఆడుతున్నారు. దీంతో ఇటీవల మన రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ మన నౌకలను హైజాక్ చేసే వారి అంతు చూస్తామని హెచ్చరించిన నేపథ్యంలో మరో నౌక హైజాక్ కు గురవడం సంచలనం కలిగిస్తోంది. హిందూ మహాసముద్రంలోని సోమాలియా తీరంలో మన నౌకను హైజాక్ చేశారు. లైబీరియా జెండాతో ఉన్న నౌకలో 15మంది సిబ్బంది ఉన్నట్లు చెబుతున్నారు. ఘటన గురించి తెలిసిన తరువాత భారత నౌకాదళం స్పందించింది. హైజాక్ గురించి యూకే మారిటైమ్ ఏజెన్సీ సందేశం పంపించింది. గురువారం సాయంత్రం గుర్తుతెలియని సాయుధులు అక్రమంగా నౌకలోకి ప్రవేశించారని తెలిసింది. దీనిపై భారత నౌకాదళం పరిశీలిస్తోంది. సముద్ర తీర గస్తీ కోసం ఐఎన్ఎస్ చెన్నై రంగంలోకి దిగింది. నౌకలోని సిబ్బందితో కమ్యూనికేషన్ కొనసాగుతోంది. వారు సురక్షితంగా ఉన్నట్లు సమాచారం. ఇటీవల కాలంలో హిందూ మహా సముద్రంలో మన నౌకలను హైజాక్ చేయడం తరచుగా జరుగుతోంది. దీనిపై మన ప్రభుత్వం కూడా సీరియస్ గానే ఉంది. నౌకలను టార్గెట్ చేసుకుని దాడులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని గతంలోనే రాజ్ నాథ్ సింగ్ హెచ్చరించారు. ఇజ్రాయెల్, హమాస్ దాడుల నేపథ్యంలో నౌకలను హైజాక్ చేస్తున్నారనే వాదనలు కూడా వస్తున్నాయి. వారి దాడుల పరంపరలోనే భాగంగానే ఇలా మన నౌకలను లక్ష్యంగా చేసుకుని హైజాక్ లకు పాల్పడటంతో మనకు నష్టాలు వస్తున్నాయి. ఈనేపథ్యంలో కొద్ది రోజుల క్రితం భారత్ కు వస్తున్న ఓ వాణిజ్య నౌకను గుజరాత్ తీరంలో డ్రోన్ దాడి జరగడం తెలిసిందే. విషయం తెలుసుకున్న మన నౌకాదళం కూడా ధీటుగానే స్పందించింది. తక్షణమే సహాయక చర్యలు చేపట్టింది. ప్రమాదం నుంచి 20 మంది భారతీయులను సురక్షితంగా తీసుకొచ్చింది. ఇలా మన నౌకలను ఎంచుకుని మరీ హైజాక్ చేయడంపై ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంటోంది. ఇక మీదట నౌకల హైజాక్ కాకుండా చేయడానికే నిర్ణయించుకుంది. ఇజ్రాయెల్, హమాస్ దాడుల సందర్భంగా వారు ఉగ్ర చర్యలకు తెగబడుతున్నారు. అందుకే మన నౌకలు వారికి తారసపడుతున్నాయనే వాదనలు వస్తున్నాయి. అందుకే మన నౌకలు హైజాక్ కు గురవుతున్నాయని తెలుస్తోంది.

# మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం



శామీర్ పేట, (గరుడ వార్త) : మెడిసిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మూడు చింతలపల్లి మండలం అద్రా స్ పల్లి గ్రామం లో గురువారం మెడిసిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలతో పాటు, చెవి, ముక్కు, గొంతు, వరిబీజము, బీజకుట్టు, గడ్డలు, కనతులు, థైరాయిడ్ గడ్డలు, గర్భ సంచికి సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ళ నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు చూసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 125 మందికి షుగర్, బీపీ, టెస్టులు చేయగా, ఆపరేషన్ అవసరము ఉన్న 31 మందిని మెడిసిటీ ఆసుపత్రికి రిఫేర్ చేశారు. వీరిని మెడిసిటీ హాస్పిటల్ కు తరలించి ఉచితంగ ఆపరేషన్లు చేయడం జరుగుతుందనీ నిర్వాహకులు చెప్పారు. ఈ కార్యక్రమములో వైద్య బృందం ఓమర్, అపూర్వ , శ్రీయ, కుషలు, మార్కెటింగ్ ఇంచార్జి కుమారస్వామి, నాగార్జున, సత్యనారాయణ, అఖిల, మాజీ సర్పంచ్ బోయిని లలిత, పంచాయతీ సెక్రటరీ ఉష,కారోబార్ విజయ్ కుమార్, పాల్గొన్నారు.

# ఆలయ భూముల్లోంచి యదేచ్ఛగా ప్రైవేటు రోడ్డు వేసేందుకు యత్నం





### అడ్డుకున్న ఆలయ చైర్మన్...

శామీర్ పేట, (గరుడ వార్త) : బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయ భూముల్లోంచి ప్రైవేట్ వ్యక్తులు రోడ్డు వేస్తుండగా ఆలయ చైర్మన్ అడ్డుకొని తాశీల్దార్ కు గురువారం ఫిర్యాదు చేశారు. మూడు చింతలపల్లి మండలం కేశవరం గ్రామ పరిధిలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన దేవాదాయ భూమిలో నుంచి ప్రైవేట్ వ్యక్తులు దర్జాగా జెసిబితో చదును చేసి రోడ్డు వేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆలయ చైర్మన్ మైసయ్య, ఈవో శ్రీనివాసరావు, మాజీ వార్డు సభ్యులు శ్రీశైలం యాదవ్ లు అడ్డుకు న్నారు. ఇట్టి విషయంపై మూడు చింతలపల్లి తాశీల్దార్ వాణి రెడ్డికి ఫిర్యాదు చేశారు. వెంటనే అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని తాశీల్దారును వారు కోరారు.

# ఆలన.. అంతులేని సాంత్వన



మంచిర్యాల : క్యాన్సర్, పక్షవాతం.. రెండూ దీర్ఘకాలిక వ్యాధులే. ఒకటి ప్రాణాలు తీసుకుంటే మరొకటి బతికి ఉన్నా లేనట్లే చేస్తోంది. సంబంధిత వ్యాధిగ్రస్థుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా 'ఆలన' పేరుతో ఆపన్నహస్తం అందిస్తోంది. మంచానికే పరిమితమైన వారిని అక్కున చేర్చుకుంటోంది. ఈ విభాగంలోని సిబ్బంది అందిస్తున్న సేవలతో బాధితుల జీవితకాలం పెరుగుతోంది. కోలుకునే పరిస్థితి ఉన్నవారికి అవగాహన కల్పిస్తూ మెరుగైన వైద్యం పొందేలా చేస్తోంది. పాలియేటివ్ కేర్ పేరుతో జిల్లా కేంద్రంలో వార్డును అందుబాటులోకి తీసుకొచ్చింది. వైద్యులు, సిబ్బందిని నియమించి రెండేళ్లుగా సేవలందిస్తోంది.

### బాధితుల జీవితకాలం పెంచేలా..

క్యాన్సర్ బాధితుల బాధలు వర్ణణాతీతం. దాదాపు 30 రకాలుగా ఉండే సంబంధిత వ్యాధిగ్రస్థులకు భరించలేనంత నొప్పి ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. చివరి దశకు చేరుకుని మంచానికే పరిమితమైన వారికి కాస్త ఉపశమనం కలిగించేలా సేవలందిస్తున్నారు ఆలన సిబ్బంది. తనకు తానుగా కాలకృత్యాలు నిర్వహించుకునే పరిస్థితికి తీసుకొస్తున్నారు. పాలియేటివ్ కేర్ సేవలతో జిల్లాలోని క్యాన్సర్ బాధితుల జీవిత కాలాన్ని పెంచుతున్నారు. జిల్లాలో గుర్తించిన బాధితులందరి నివాసాలకు వెళ్లి తీవ్రతను బట్టి చికిత్స అందిస్తున్నారు. ఆహారాన్ని తీసుకోలేని పరిస్థితి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నవారికి ముక్కు, గొంతు వద్ద పైపులను ఏర్పాటు చేస్తున్నారు. వీటిని సక్రమంగా పొందేలా చూస్తున్నారు. వ్యాధి తీవ్రత ఆధారంగా వీరికి కేటాయించిన వాహనం ద్వారా నెలలో రెండు, మూడుసార్లు సంబంధిత బాధితుల దగ్గరకు వెళ్తున్నారు. యోగక్షేమాలపై ఆరా తీస్తూ దాదాపు పదిరకాల సేవలను అందిస్తున్నారు. విషమ పరిస్థితికి చేరుకున్నవారిని జీజీహెచ్‌లో పది పడకలతో ఏర్పాటు చేసిన పాలియేటివ్ కేర్ యూనిట్‌కు తరలించి సేవలందిస్తున్నారు.

### అరుదైన డ్రగ్ అందుబాటులోకి..

క్యాన్సర్ బాధితుల చివరి దశలో తీవ్రమైన నొప్పులు ఉంటాయి. వీరికి ఉపశమనం కలిగించేలా త్వరలోనే పాలియేటివ్ కేర్ యూనిట్ ఓ డ్రగ్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ మందు బయట ఏ షాపులో దొరకదు. ఏ వైద్యుడికి ఇచ్చే అర్హత ఉండదు. ఇది ఈ యూనిట్ సిబ్బందికే మాత్రమే పరిమితం. ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమే దీనిని తీసుకొచ్చి వ్యాధిగ్రస్థులకు ఉపశమనం కలిగించడం. ఈ డ్రగ్‌ను అందించే అనుమతిని త్వరలోనే ఆలన వైద్యుడికి ఇవ్వనున్నారు. ఇది కేవలం తీవ్రత ఎక్కువగా ఉన్న క్యాన్సర్ వ్యాధిగ్రస్థుల ఉపశమనం కోసం ఇస్తారు. అనుమానం ఉంటే పరీక్షలు చేసుకోవాలిడా. స్పందన, పాలియేటివ్ కేర్ యూనిట్ వైద్యాధికారిక్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తించి సరియైన సమయంలో చికిత్సను పొందితే బయటపడే అవకాశముంటుంది. శరీరంలో ఏ ఇబ్బంది ఉన్నా వైద్యుడిని సంప్రదించి పరీక్షలు చేసుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయి. అనుమానం ఉంటే గ్రామాల్లోని ఆరోగ్యకర్తలకు సమాచారం అందించాలి. వ్యాధిగ్రస్థులను చిన్నచూపు చూడకుండా అక్కున చేర్చుకుని మనోధైర్యాన్ని కల్పించాలి.

# పట్టణవాసులకు.. వైద్యం మరింత చేరువ

ఆదిలాబాద్ : పట్టణవాసులకు వైద్యం మరింత చేరువ కానుంది. ఉమ్మడి జిల్లాలోని మూడు పురపాలక సంఘాల్లో హైదరాబాద్ తరహా బస్తీ దవాఖానాలను ప్రభుత్వం ఇది వరకే మంజూరు చేసింది. రెండో విడతలో మళ్లీ ఉమ్మడి జిల్లాలో అయిదు బస్తీ దవాఖానాలను మంజూరు చేస్తూ మున్సిపల్ పరిపాలన శాఖ ఉత్తర్వులు వెలువరించింది. దీంతో పట్టణవాసులకు వైద్యం మరింత చేరువ కానుంది. ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల పురపాలక సంఘాల్లో ఒక్కో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలని పురపాలక పరిపాలనా విభాగం గత మార్చిలో ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అధికారులు అనువైన స్థలాలను ఎంపిక చేసి ఆయా ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్కే కాలనీలో ఇటీవలే బస్తీదవాఖానాను ప్రారంభించి సేవలను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం మళ్లీ రెండో విడతలో మంచిర్యాల జిల్లాలో మంచిర్యాల, బెల్లంపల్లి, నిర్మల్ జిల్లాలో ఖానాపూర్, భైంసా, ఆదిలాబాద్ జిల్లాలో




ఆదిలాబాద్‌లో వీటిని మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

### ఒక్కో ఆసుపత్రికి రూ.13 లక్షలు

ఆదిలాబాద్ పురపాలక సంఘం పరిధిలో ఇప్పటికే శాంతినగర్, పుత్లీబౌలి, హమాలీవాడ, ఖుర్షీద్‌నగర్, చిలుకూరిలక్ష్మీనగర్ కాలనీల్లో పట్టణ పీహెచ్‌సీలున్నాయి. అదే విధంగా నిర్మల్ పట్టణంలో రాంనగర్, బంగల్‌పేట్లో రెండు, మంచిర్యాల పురపాలక సంఘం పరిధిలో రాజీవ్‌నగర్, పాత మంచిర్యాలలో అర్బన్ పీహెచ్‌సీలు ఉన్నాయి. ఈ పీహెచ్‌సీలకు పట్టణంలోని శివారు ప్రాంతాల నుంచి బాధితులు, గర్భిణులు వచ్చి వైద్యం పొందటం ఇబ్బందిగా మారింది. కొత్తగా మంజూరైన బస్తీ దవాఖానాలు ప్రారంభం అయితే పట్టణవాసులకు ఆరోగ్యపరంగా ఇబ్బందులు దూరం కానున్నాయి. ఒక్కో బస్తీ దవాఖానా కోసం రూ.13 లక్షల చొప్పున మంజూరు చేసింది. ఈ ఆసుపత్రిలో ఒక వైద్యుడు, ఒక ఏఎన్ఎం, మరో సహాయకుడు ఉంటారు.

### వైద్యపరంగా ఇబ్బందులు దూరం - జోగు ప్రేమేందర్, పురపాలక ఛైర్మన్

పట్టణంలోని సుదూర ప్రాంతాల నుంచి ఆటోల్లో పట్టణ పీహెచ్‌సీలకు బాధితులు వెళ్లటం ఇబ్బందికరంగా మారింది. బస్తీ దవాఖానాలను ఆయా కాలనీల్లోనే ఏర్పాటు చేయటం వల్ల వారి ఇబ్బందులు తొలగినట్లయింది. ఇది వరకే ఒకటి ప్రారంభించాం. కొత్తగా మంజూరైనన దవాఖానా సైతం త్వరలో ప్రారంభిస్తాం.

# చేసిందే పని.. అడిగేవారు లేరని..

నిర్మల్ : ప్రజాధనం దుర్వినియోగం అంటే ఇదేనేమో.. లక్ష కాదు.. రెండు లక్షలు కాదు.. చిన్నపాటి మరమ్మతులకే ఏకంగా రూ.15 లక్షల బిల్లును పురపాలకవర్గం ఆమోదించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా పంద్రాగస్టు సంబరాలు నిర్వహణకు ఎన్టీఆర్ మినీ స్టేడియం మైదానంలో ఈ నిధులు కుమ్మరించారు. అడిగే వారు లేరని.. అడ్డదిడ్డంగా పనులు చేసినట్లు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తే స్పష్టమవుతోంది. క్రీడల మైదానంలో ఇష్టారీతిన అడ్డదిడ్డంగా కంకర చిప్స్ పోసి ఆటలు ఆడటానికి వీల్లేకుండా చేశారు. మైదానంలో నడక సాధ్యంకాని పరిస్థితి ఉందంటే ఇక్కడ పనులు ఎలా చేశారో అర్థమవుతోంది.

### మూడు అంశాలుగా విభజించి..

ఆగస్టు 15 వేడుకల నిర్వహణకు ఎన్టీఆర్ మినీ స్టేడియం మైదానంలో మరమ్మతులు చేయాలని జిల్లా పాలనాధికారి మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. క్రషర్ చిప్స్ (చిన్నపాటికంకర), స్టోన్ డస్ట్ (రాతిపొడి)తో మైదానం మరమ్మతులు చేసినట్లు గత నెల 30న నిర్వహించిన మున్సిపల్ సమావేశంలో ప్రవేశపెట్టిన ఎజెండాలో క్రమ సంఖ్య 234, 235, 235లతో మూడు అంశాలుగా విభజించారు. ఒక్కో దానికి మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.5 లక్షల చొప్పున వెచ్చిస్తున్నట్లు అందులో పొందుపర్చారు. రూ. 5లక్షలకంటే ఎక్కువైతే ఈ-ప్రొక్యూర్‌మెంట్ చేయాల్సి ఉండటంతో ఇలా విభజించారు. మొదటి అంశంలో ఎన్టీఆర్ మినీ స్టేడియం వద్ద స్పోర్ట్స్ పెవిలియన్ బిల్డింగ్ (ఎడమ వైపు) వద్ద స్టోన్ డస్ట్ ఫిల్లింగ్, క్రషర్ చిప్స్‌తో ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. రెండో అంశంలో.. ఇదే మైదానంలో పరేడ్ చేసే ప్రాంతం (మొదటి అంశం ముందరి భాగం)లో స్టోన్ డస్ట్ ఫిల్లింగ్, క్రషర్ చిప్స్‌తో ఏర్పాట్లు చేశారని, మూడో అంశంలోనూ మినీ స్టేడియం వద్ద (మొదటి అంశంలో పేర్కొన్న స్పోర్ట్స్ పెవిలియన్ బిల్డింగ్) మళ్లీ స్టోన్ డస్ట్ ఫిల్లింగ్, క్రషర్ చిప్స్‌తో మెటీరియల్ రోలింగ్, ఇతరత్రా పనులు చేసినట్లు పేర్కొనడం గమనార్హం.

### ఆటలకు ఆటంకాలు

మరమ్మతుల కోసమని మైదానంలో పోసిన క్రషర్ చిప్స్ క్రీడలు ఆడేందుకు ఆటంకాలు ఏర్పడ్డాయి. వర్షం నీరు నిలిచిందని ఈ చిప్స్ పోసినా.. సరిగా చదును చేయకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ గుంతలు ఏర్పడటంతో క్రీడాకారులు అక్కడ ఆటలు ఆడలేని పరిస్థితులు నెలకొన్నాయి. కనీసం ఉదయం, సాయంత్రం సమయాల్లో మైదానంలో నడక చేయలేకపోతున్నారు. ఇక్కడి నుంచి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో సత్తా చూపించే క్రీడాకారులున్నా.. ఆడేందుకు ఉన్న ఈ ఒక్క మైదానం సరిగా మరమ్మతులు చేయడం లేదు. ఈ మైదానం బాగు చేయడానికి ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా.. పెడచెవిన పెడుతున్నారంటూ క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### వర్షం నీటిలోనూ ట్యాంకర్‌తో క్యూరింగ్ చేశారట..

ఆగస్టు 15న జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం మైదానంలో జాతీయ జెండా ఆవిష్కరణ సమయంలో కురిసిన చిరు జల్లుల్లోనే స్వతంత్ర భారత వజ్రోత్సవ సంబరాలు అట్టహాసంగా జరిపారు. దీనికి ముందు రెండు రోజులపాటు వర్షం పడటంతో మైదానమంతా చిత్తడిగా మారింది. మైదానం మరమ్మతులు చేయడానికి క్రషర్ చిప్స్, స్టోన్ డస్ట్‌ను వాడినా.. వర్షం నీరుతో మైదానమంతా చిత్తడిగా ఉంది. అయినప్పటికీ వాటర్ ట్యాంకర్‌తో క్యూరింగ్ చేశామని చెప్పడం కొసమెరుపు. మైదానం మొత్తం మరమ్మతులు చేశామని చెబుతున్నా.. సగం మాత్రమే చేసి మిగతాది వదిలేశారు.

# సదా శిశువుల సేవలో..!

భువనగిరి : శిశు మరణాలు తగ్గించడంతో పాటు అప్పుడే పుట్టిన శిశువులకు తలెత్తే అనారోగ్య సమస్యలకు సత్వరం చికిత్స అందించేలా ప్రభుత్వం జిల్లాకు ఒక ప్రత్యేక అంబులెన్స్‌ను ఏర్పాటు చేసింది. ఆపదలో ఉన్న నవజాత శిశువులను హైదరాబాద్‌లోని చిన్న పిల్లల ఆసుపత్రి నిలోఫర్, గాంధీ ఆసుపత్రికి తరలించేందుకు 108 నవజాత శిశువు అంబులెన్స్ 24 గంటలు జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉంటుంది. గత ఏడాది ఆగస్టు నుంచి ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. సాధారణ సమస్యలు ఉన్నవారికి ఆసుపత్రిలోని నవజాత శిశువు వార్డు(ఎస్‌ఎన్‌సీయూ)లో వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రసవం తర్వాత ఇంటి వద్ద ఉన్న సమయాల్లో శిశువులకు అనారోగ్య సమస్యలు తలెత్తితే జిల్లాలో ఎక్కడి నుంచి అయినా ఆసుపత్రికి తరలించేందుకు నవజాత 108 అంబులెన్స్‌ను వినియోగించుకోవచ్చు.




ప్రత్యేకతలు ఇవీ..

నవజాత అంబులెన్స్‌లో శిశువుకు రక్షణ ఇచ్చేలా అన్ని పరికరాలు ఏర్పాటు చేశారు. ఆక్సిజన్ పోర్టబుల్ సిలిండర్, శిశువు ఉష్ణోగ్రత కోల్పోకుండా బేబీ వార్మింగ్, వెంటిలేటర్, ఇంజెక్షన్ ఇచ్చే సిరంజి పంపు, బీపీ మానిటర్, ఐవీ ఫ్లూయిడ్ సులువుగా పంపించే పరికరం, డ్రగ్ సిరంజ్ పరికరం, సెక్షన్ ఆపరేటర్ ఉన్నాయి. అంబులెన్స్‌లో ఉన్న శిశువును ఫోర్టుబుల్ సిలిండర్‌తో సహా ఆసుపత్రి లోపలి వరకు తీసుకువెళ్లేలా ఏర్పాట్లు చేశారు.

సాధారణ అంబులెన్స్ మాదిరిగానే ఒక పైలెట్, అనుభవం ఉన్న ఈఎంటీ ఉంటారు. రెండు షిఫ్టుల్లో 24 గంటల పాటు అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంటాయి. జిల్లాలో అందుబటోకి వచ్చిన నుంచి ప్రతి నెల 30 నుంచి 40 మందిని శిశువులను తరలిస్తున్నారు.

రక్షణతో తరలింపు- విశ్వం, అంబులెన్స్ ఈఎంటీ

అప్పుడే పుట్టిన శిశువులకు అత్యవసర చికిత్స అవసరమైన సమయాల్లో తరలించేందుకు నవజాత 108 అంబులెన్స్ ప్రత్యేకంగా సేవలు అందిస్తోంది. ఆసుపత్రికి తరలించే వరకు శిశువు ఆరోగ్యం నిలకడగా ఉండేలా అన్నీ ఏర్పాట్లు ఉన్నాయి. జిల్లా కేంద్రాసుపత్రిలో 24 గంటలపాటు సేవలు వినియోగించుకోవచ్చు.

# మన బడి.. మళ్లీ తడబడి..!

పాల్వంచ : ఇదీ.. కొత్తగూడెం పట్టణం రామవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల. ఇక్కడ 220 మందికి పైగా విద్యనభ్యసిస్తున్నారు. రూ.55 లక్షలతో పాఠశాలకు పనులు మంజూరు చేశారు. ప్రహరీ, తాగునీరు, పైపులైన్లు, విద్యుత్తు వ్యవస్థ, ఇతర మరమ్మతులు చేపట్టారు. ఆయా పనులన్నీ ప్రస్తుతం చివరి దశలో నిలిచిపోయాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించింది. పథకం కింద చేపట్టిన పనులు వివిధ పాఠశాలల్లో తుది దశలో నిలిచిపోయాయి. మరికొన్ని చోట్ల నత్తనడకన సాగుతున్నాయి. గతేడాది జులై నుంచి చేస్తున్న పనులకు ఇంకా నిధులు రావాల్సి ఉండటంతో గుత్తేదారులు చేతులెత్తేశారు. ఫలితంగా తొలి విడతలో ప్రారంభించిన అదనపు తరగతి గదులు, మరమ్మతులు, డైనింగ్ హాళ్లు, వంటశాలలు, మూత్రశాలల పనులకు మోక్షం కలిగేలా లేదు. ఈ సమయంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకాగా.. రెండు, మూడు దశల్లో పనులు ప్రారంభించేనా? లేక పక్కన పెట్టేనా? అనే సందేహాలు విద్యాశాఖ వర్గాల్లో తలెత్తుతున్నాయి.

పథకం కింద 12 రకాల అభివృద్ధి పనులను ఇంజినీరింగ్ విభాగం అధికారులు గుర్తించిన విషయం తెలిసిందే. తొలినాళ్లలో చాలా మంది గుత్తేదారులు బిల్లుల మంజూరుపై సందేహంతో పనులు ఆలస్యంగా చేపట్టారు. ఇన్నాళ్లుగా 70 నుంచి 80 శాతం సివిల్ పనులు పూర్తిచేయించారు. వీటితో పాటు మిగతా చిన్నపాటి మరమ్మతులు చేపడితే వచ్చే విద్యా సంవత్సరం నాటికి విద్యాలయాల పరిస్థితి కాస్త మెరుగుపడుతుంది. నిబంధనల ప్రకారం పాఠశాలల యాజమాన్య కమిటీల (ఎస్‌ఎంసీ) ఛైర్మన్ల ఆధ్వర్యంలో పనులు చేపట్టాల్సి ఉంది. కానీ చాలాచోట్ల సర్పంచులే వీటిని ప్రారంభించారు. రూ.30 లక్షలకు పైగా నిధులతో చేపట్టే పనులకు టెండర్లు నిర్వహించగా.. కొన్ని మండలాల్లో గుత్తేదారులెవరూ నేటికీ ముందుకు రాని పరిస్థితి నెలకొంది. ముందుకు వచ్చి డైనింగ్‌హాళ్లు, మూత్రశాలలు వంటి



అభివృద్ధి పనులు పూర్తిచేసిన వారికి బిల్లులు విడుదల కాకపోవడంతో గుత్తేదారులు తాళాలు వేసుకుని వెళ్లారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పథకం కొనసాగింపుపై ఏ నిర్ణయం తీసుకుంటుంది? అనేది చర్చనీయాంశంగా మారింది.

సత్తుపల్లి మండలం ఎన్టీఆర్ నగర్ ప్రాథమిక పాఠశాలకు పథకం కింద రూ.40 లక్షలు మంజూరయ్యాయి. వీటిలో రూ.37 లక్షలతో చేపట్టిన పనుల్లో వంటషెడ్డు, పాఠశాల భవనం, మూత్రశాలలు, టైల్స్ వేసే పనులు అసంపూర్ణంగా మిగిలాయి. మట్టి తోలకాలతో పాటు మొక్కలు నాటించాల్సి ఉంది.

పనుల పురోగతిపై కలెక్టర్ నిత్యం సమీక్షలు నిర్వహిస్తున్నారు. సంబంధిత ఇంజినీర్లు, గుత్తేదారులకు సూచనలు చేస్తున్నారు. నిధుల మంజూరులో కాస్త ఆలస్యం అవుతోంది. వచ్చే సంవత్సరం నాటికి పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు పూర్తి చేయిస్తాం.

# అడ్డదారిలో అనుమతులు



జగిత్యాల : కళలకు, కళాకారుల కోసం నిర్మించిన టౌన్‌హాలు(కళాభవన్) నిర్వహణ వ్యవహారం ఆది నుంచి వివాదాస్పదమవుతోంది. నిర్మాణ దశలో 10 సంవత్సరాలు తర్వాత మరో దశాబ్దంపాటు భవనం నిరుపయోగంగానే ఉంది. పట్టణ నడిబొడ్డున ఐడీఎస్‌ఎంటీ నిధులు రూ.కోటి వెచ్చించిన భవనంలో ప్రస్తుత పాలకవర్గం రూ.40 లక్షలతో సాంకేతిక మార్పులు చేపట్టి ఎట్టకేలకు రెండేళ్ల క్రితం వినియోగంలోకి తెచ్చింది. ఈ క్రమంలో భవన టెండర్ల నిర్వహణలో అధికారులు పారదర్శకత పాటించలేకపోయారు. ఈ విషయంపై అప్పట్లోనే స్వపక్ష, విపక్ష సభ్యుల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో అధికారులు మొదటి టెండరు రద్దు చేసి మరోసారి టెండరు పిలిచారు. నెలకు రూ.1,26 లక్షలతో టౌన్‌హాలు టెండరుదారుకు స్వాధీనం చేశారు.

జిల్లా అధికారులకు ఫిర్యాదులు..

టౌన్‌హాలు కల్యాణ మంటపం కోసం లీజుకు తీసుకున్న నిర్వాహకులు ఆవరణలో 3 షెడ్లు నిర్మించారు. ఆ తరువాత భవనం రెండు అంతస్తుల్లో రెండు హొటళ్లను ఏర్పాటు చేశారు. ఇందులో కొన్ని షెడ్లను సబ్ లీజుకు ఇచ్చారనే ప్రచారం జరిగింది. ఈ వ్యవహారంలో పాలకవర్గంలోని కొందరు ప్రజాప్రతినిధులు సైతం భాగస్వాములయ్యారు. ఏడాది క్రితం ఇదే విషయంపై పురపాలక సమావేశాల్లోనూ తీవ్రస్థాయిలో చర్చ జరిగింది. జిల్లా అధికారులకు సైతం ఫిర్యాదులందినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారు. తాజాగా టౌన్‌హాలు పై భాగంలో కళ్లు చెదిరే హొటల్ ఏర్పాటు కావడం ఇందుకు సంబంధించిన అద్దె నిర్వాహకుల జేబులోకి వెళ్తుందని ప్రజాధనం దుర్వినియోగమవుతుందని విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 5 గంటలకే పురపాలక అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రెండు హొటళ్లను సీజ్ చేసిన విషయం విదితమే.

అక్రమాలు వెలుగులోకి..

టౌన్‌హాలు పార్కింగ్ స్థలంలో పురపాలక అధికారుల అనుమతి లేకుండా షెడ్ల నిర్మాణం జరిగిందని 12 డిసెంబరు 2022న కథనం ప్రచురితమైంది. సామాజిక మాధ్యమాల్లో టౌన్‌హాలు వ్యవహారంపై పౌరుల నుంచి వ్యతిరేకత ఏర్పడింది. దీనిపై జిల్లాస్థాయి అధికారులు పుర అధికారులను పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని కోరారు. కానీ ఎలాంటి చర్యలకు ఉపక్రమించలేదు.

ఇంజినీరింగ్ అధికారుల వైఫల్యం..పురపాలక ఇంజినీరింగ్ విభాగం అధికారులు టౌన్‌హాలు లీజుకు సంబంధించిన వ్యవహారంలో పూర్తిగా విఫలం చెందారు. నిబంధనల ప్రకారం ఇంజినీరింగ్ అధికారులు టెండరు నిర్వహించాల్సి ఉండగా కొందరు ప్రజాప్రతినిధుల జోక్యంతో రెవెన్యూ విభాగంతో టెండరు నిర్వహించారు. ఇందులోనూ ఎలాంటి పారదర్శకత పాటించకపో వడంతో టెండర్లపై సైతం వివాదం తలెత్తింది. భవనంలో ఇతర షెడ్లు ఏర్పాటు చేసినా టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు ఏమాత్రం నిర్వాహకులకు నోటీసులు జారీ చేయకపోవడం గమనార్హం. అధికారుల సాక్షిగా టౌన్‌హాలులో అక్రమ నిర్మాణాలు విస్తరించినా చర్యలకు వెనుకంజ వేశారు. ప్రభుత్వ మార్పు అనంతరం రెండు హొటళ్లను సీజ్ చేయడం చర్చనీయాంశమైంది.

నిబంధనలు అమలు చేస్తాంగతంలో ఉన్న అధికారులు, సిబ్బంది ఏ మేరకు టెండర్లు నిర్వహించారు నాకు తెలియదు. టెండర్లలో కొన్ని తప్పులు దొర్లిన విషయం వాస్తవమే. ప్రస్తుతం ఆక్రమిత షెడ్లపై చర్యలు తీసుకుంటున్నాం. నిబంధనల మేరకే టౌన్ హాల్ నిర్వహణ కొనసాగుతుంది. అనిల్‌బాబు, కమిషనర్

# స్వచ్ఛ చౌటుప్పల్‌గా ఎప్పటికి మారేనో..?

భువనగిరి : 'స్వచ్ఛ చౌటుప్పల్'గా మార్చి రాష్ట్రంలోనే ఆదర్శ పురపాలికగా తీర్చిదిద్దుతామని పాలకవర్గం ప్రకటించి నాలుగేళ్లు దాటినా లక్ష్యం చేరడం లేదు. స్వచ్ఛత పోటీలో ముందుండాలని ప్రయత్నిస్తున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఏటా నిర్వహిస్తున్న 'స్వచ్ఛ సర్వేక్షణ్' సర్వేలో చౌటుప్పల్ పురపాలిక పురోగతి సాధించడం లేదు. పురపాలిక నిధులతో బుట్టలు కొనుగోలు చేసి తడి, పొడి చెత్తను వేరు చేసి ఆటోల్లో వేయడానికి ఇంటికి రెండు చొప్పున పంపిణీ చేశారు. ప్రత్యేకంగా డంపింగ్ యార్డు లేకపోవడంతో ఆటోల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి తెచ్చి స్థానికంగా ప్రైవేటు వెంచర్‌లో బహిరంగంగా పారబోస్తున్నారు. తడి చెత్తను సేంద్రియ ఎరువుగా, పొడి చెత్తను రీసైక్లింగ్ చేసే ప్రక్రియ అమలు చేయడం లేదు. దీంతో ఈ విభాగంలో మార్కులు తగ్గుతున్నాయి. మానవ వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంటు ఏర్పాటుకు నిధులు మంజూరైనా స్థలం వివాదంతో పనులు నిల్చిపోయాయి. మునుగోడు ఉప ఎన్నిక తర్వాత ప్రభుత్వం నుంచి



నిధులు విడుదల కావడంతో అన్ని వార్డుల్లో సిమెంటు రోడ్లు, భూగర్భ డ్రైనేజీలు నిర్మాణం కావడంతో నివాస ప్రాంతాల పరిసరాలు పరిశుభ్రంగా మారడంతో ఈ విభాగంలో మార్కులు సాధించారు. ఇటీవల ప్రజాభిప్రాయంతో పాటు క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించి పురపాలికలకు ర్యాంకులు ప్రకటించారు.

ఉత్తమ ర్యాంకు కోసం కృషి చేస్తున్నాం- ఎస్.భాస్కర్‌రెడ్డి, చౌటుప్పల్ పురపాలిక కమిషనర్‌చెత్త డంపింగ్ యార్డు, మానవ వ్యర్థాల శుద్ధీకరణ లేకపోవడంతో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేకపోతు న్నాం. చెత్త డంపింగ్ యార్డుకు ప్రభుత్వం నుంచి రూ.60లక్షలు, 10 కేఎల్‌డీ సామర్థ్యం గల ఎఫ్‌ఎస్‌టీపీ ఏర్పాటుకు రూ.1.43కోట్లు మంజూరయ్యాయి. ప్రభుత్వం స్థలం కేటాయించినా స్థానికుల అభ్యంత రాలతో ఇవి ఏర్పాటు కాలేదు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వారి సూచన ప్రకారం నిర్ణయం తీసుకుని స్వచ్ఛ చౌటుప్పల్ లక్ష్యం సాధించేందుకు పాలకవర్గం సహకారంతో ముందుకు పోతాం.

# రెట్టింపు వల!



జగిత్యాల : జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన యువకుడు హైదరాబాద్‌లో పీజీ చేస్తూ పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్నాడు. పీజీ చదువుతున్న కుమారుడు ఇంటికి ఆసరా అవుతాడని కుటుంబసభ్యులు భావించగా ఆన్‌లైన్ గేమ్స్ కోసం యాప్‌లలో అప్పులు చేశాడు. డబ్బు పోగొట్టుకోవడంతో డబ్బులెలా చెల్లించాలో తెలియక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ కుటుంబానికి తీవ్ర ఆవేదన మిగిల్చాడు.

కరీంనగర్ జిల్లాలో ఓ యువకుడు జీతం డబ్బులు పొదుపు చేసి బిట్‌కాయిన్ ఏజెంట్ వలలో పడ్డాడు. ఏజెంటు చెప్పింది నమ్మి మొదట రూ.20 వేలు పెట్టుబడి పెట్టగా లాభం చూపించాడు. దీంతో రూ.6 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టగా ఏజెంటు నుంచి స్పందన లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు

వీణవంక మండలానికి చెందిన ఓ యువకుడికి.. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని చెప్పడంతో నమ్మి రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టాడు. తరవాత అవతలి వ్యక్తి నుంచి స్పందన లేదు.. ప్రపంచంలో ఏదీ ఉచితంగా రాదని.. కొద్ది రోజుల్లోనే డబ్బుకు రెట్టింపు ఇస్తామనే మాటలు నమ్మొద్దని పోలీసులు ప్రచారం చేస్తున్నా కొంతమంది ఇంకా ఆ వలలో పడుతూనే ఉన్నారు. అప్పోసప్పో చేసి ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడుతూ, బిట్‌కాయిన్ ట్రేడింగ్ చేస్తూ డబ్బును పోగొట్టుకుంటున్నారు. క్రమంలో కొందరు బలవన్మరణాలకు పాల్పడుతుండగా మరికొందరు తీవ్రంగా మనస్తాపానికి గురవుతున్నారు.

ఒకరిని చూసి ఒకరు.. : ఉమ్మడి జిల్లాలో పలువురు క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడుతున్నారు. రెట్టింపు డబ్బులు వస్తాయనే ఆశతో అప్పులు చేసి మరీ పలువురు యువకులు ఈ మాయలో పడుతున్నారు. ఒకరిని చూసి ఒకరు అన్నట్లుగా ఈ గ్రూపుల్లో చేరుతున్నారు. మొదట్లో లాభాలు చూపి తరవాత వారితో రెట్టింపు సొమ్ము పెట్టుబడి పెట్టించి బిచాణా ఎత్తేస్తున్నారు. దీంతో రూ.లక్షల్లో నష్టపోతున్నారు. బాధితుల్లో ఉద్యోగులు, యువకులు ఎక్కువ సంఖ్యలో ఉండటం గమనార్హం. ఇక ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ అప్పుల్లో మునుగుతున్న వారూ పెద్దఎత్తున ఉంటున్నారు.

నిర్వాహకులు ఎవరో తెలియకున్నా.. : క్రిప్టో కరెన్సీకి చట్టబద్ధత లేదు. వాటిని ఎవరు నిర్వహిస్తున్నారో తెలియదు. కానీ ఏజెంట్లు వారి వ్యాపారాభివృద్ధికి జనాన్ని ఆకర్షితులను చేస్తున్నారు. ఎలాంటి చిరునామా, ఇతర వివరాలు లేకుండానే సాగుతున్న ఈ వ్యాపారాల వల్ల నష్టపోతున్న చాలా మంది బయటకు చెప్పుకొంటే అభాసుపాలవుతామని లోలోనే కుమిలిపోతున్నారు. పోలీసు శాఖ ఈ వ్యవహారాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఇలాంటివి నమ్మొద్దని ప్రచారం చేయడంతోపాటు ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నవారిని గుర్తించి వారిని నియంత్రించడం ద్వారా ఈ చట్టబద్ధత లేని వ్యాపారాల నుంచి సామాన్యులను కాపాడాలి.

అప్రమత్తత అవసరం

వీణవంక : సైబర్ మోసగాళ్లు ఎక్కువయ్యారు. ప్రజలు అవగాహనతో అప్రమత్తంగా ఉండటం ద్వారా వారి బారిన పడకుండా ఉండవచ్చు. ఇప్పటికే ఈ మోసాలపై విద్యాలయాల్లో, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నా.. మోసపోతూనే ఉన్నారు. కొత్త ఖాతాల పేరుతో, అకౌంటు అప్‌డేట్ చేస్తామని, క్రెడిట్ కార్డులని, నిరుద్యోగ యువతను ఉద్యోగాల పేరుతో డబ్బులు పంపాలని, ఆదాయం రెట్టింపు అవుతుందని ఇలా పలు రకాలుగా మోసాలు చేస్తున్నారు. బ్యాంకుల పేరుతో ఫోన్‌లు చేసినా, డబ్బులు పంపాలని ఎవరు అడిగినా మోసం చేస్తున్నట్లు గ్రహించాలి. ఒకవేళ అప్రమత్తంగా లేక మోసపోయినా వెంటనే 1930కు ఫోన్ చేయాలి. వెంటనే చర్యలు చేపడతాం.జీవన్‌రెడ్డి, హుజూరాబాద్ ఏసీపీ

# ఆటాడేది ఎలా..!

మిర్యాలగూడ : గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు అవసరమైన సామగ్రిని అందించే లక్ష్యంతో గత ప్రభుత్వం అన్ని గ్రామ పంచాయతీల్లో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలు నిర్మించి.. గత ఏడాది సెప్టెంబరులో సామగ్రిని పంపిణీ చేసింది.

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు అవసరమైన సామగ్రిని అందించే లక్ష్యంతో గత ప్రభుత్వం అన్ని గ్రామ పంచాయతీల్లో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలు నిర్మించి.. గత ఏడాది సెప్టెంబరులో సామగ్రిని పంపిణీ చేసింది. నిర్వహణపై నిర్ణీత మార్గదర్శకాలు జారీ చేయక పోవటంతో ప్రస్తుతం ఈ క్రీడా సామగ్రి గ్రామ పంచాయతీల్లో మూలన పడి ఉన్నాయి. ప్రభుత్వం క్రీడా సామగ్రి అందజేసిన కొద్ది రోజుల్లోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో దీనిపై ఎలాంటి నిర్ణయం వెలువడక పోవటంతో ప్రస్తుతం ఐదునెలలుగా క్రీడాకారులకు సైతం ఉపయోగపడటం లేదు.

కిట్‌లో ఉన్న క్రీడా సామగ్రి..

క్రీడా సామగ్రి కిట్‌లో వాలీబాల్, వాలీబాల్ నెట్, క్రికెట్ కిట్, వ్యాయామం చేసే పరికరాలు, డంబెల్స్ వంటి సామగ్రిని పంపిణీ చేశారు. ఇప్పటికే చాలా చోట్ల క్రీడల కోసమని కిట్‌లను తీసుకెళ్లి తిరిగి ఇవ్వకపోవడంతో గ్రామాల్లో వీటిపై పర్యవేక్షణ కొరవడింది.

బోర్డులకే పరిమితమైన క్రీడా ప్రాంగణాలు:

గత ప్రభుత్వం చేపట్టిన క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితం అవుతున్నాయి. మొదట్లో వీటి అమలుకు కొంత మేరకు నిధులు ఖర్చు చేశారు. సరిపడా స్థలం లేక గ్రామాలకు దూరంగా క్రీడా ప్రాంగణాలను ఎంపిక చేశారు. చాలా చోట్ల పాఠశాలల ఆవరణలో రాళ్లను తొలగించి వాటిలోనే క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. వీటిపై పర్యవేక్షణ లేకపోవడంతో ప్రస్తుతం పిచ్చిమొక్కలు పెరిగి ముళ్లచెట్లకు నిలయంగా మారుతున్నాయి. పురపాలికల్లో సైతం క్రీడా ప్రాంగణాలు ఉన్నప్పటికీ వీటికి సైతం నిర్వాహణ కరవైంది. ప్రభుత్వ పాఠశాలల మైదానాలను క్రీడా ప్రాంగణాలుగా చూపి బోర్డులు పెట్టడంతో బయటి యువకులకు ఆటలకు వచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలు, క్రీడా సామగ్రిపై మరింత పర్యవేక్షణ పెంచి గ్రామీణ క్రీడాకారులకు అందుబాటులో ఉండేలా చూడాలి.

ప్రస్తుతం ప్రత్యేకాధికారులను నియమిస్తున్నందున పంచాయతీ కార్యదర్శులే క్రీడా సామగ్రిని పర్యవేక్షిస్తారు. గ్రామ పంచాయతీకి వచ్చే అన్నిరకాల సామగ్రిని వారే పర్యవేక్షించాలని డివిజనల్ పంచాయతీ అధికారి ప్రతాప్‌నాయక్ తెలిపారు.

# ప్రభుత్వ ఆస్పత్రిలో వసతుల మెరుగు

గోదావరిఖని : గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో మరికొన్ని రోజుల్లో కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి రానుంది. రామగుండం ఎన్టీపీసీ ఆధ్వర్యంలో సుమారు రూ.7 కోట్ల వ్యయంతో ఆసుపత్రి ప్రధాన భవనం రెండో అంతస్తు నిర్మాణం, లిఫ్టు ఏర్పాటుతో నిర్వహణ మెరుగుపడింది.

కళాశాలకు అనుబంధం వైద్య కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ సార్వజనిక ఆసుపత్రిలో వైద్య విభాగాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కళాశాలలో ప్రస్తుతం ఎంబీబీఎస్ రెండో సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. కోర్సు పూర్తయ్యే వరకు విద్యార్థులకు ఆసుపత్రిలో ప్రాక్టికల్స్, పరిశీలనలకు ప్రాధాన్యం ఉంటుంది. ఈ మేరకు వైద్య విద్యార్థులకు అవసరమైన అన్ని విభాగాలను ఆసుపత్రిలో ఏర్పాటు చేయాల్సి ఉంది. కళాశాల ఏర్పాటుతో ఆసుపత్రిలో అదనంగా 85 పడకల సామర్థ్యంతో భవన నిర్మాణం చేపట్టి వినియోగంలోకి తీసుకువచ్చారు. తాజాగా మరో 50 పడకల సామర్థ్యంతో క్రిటికల్ కేర్ విభాగం కోసం భవన నిర్మాణం చేపట్టనున్నారు. జల కాలుష్య నివారణలో భాగంగా ఆసుపత్రి ఆవరణలో మురుగు జలాల శుద్ధి కేంద్రం(ఎస్టీపీ) నిర్మాణ పనులు మొదలుపెట్టారు. రక్తనిధి అదనపు భవన నిర్మాణం పూర్తికాగా ఔషధ నియంత్రణ శాఖ అనుమతి రావాల్సి ఉంది. ఆసుపత్రి ప్రధాన భవనం ముందు 250 పడకల సామర్థ్యంతో భవన నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభించనున్నారు.

దశలవారీగా సేవలు...

గోదావరిఖనిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో దశలవారీగా మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయి. కొవిడ్ కాలంలో ఆర్టీపీసీఆర్ కేంద్రం, ఆక్సిజన్ ప్లాంటు ఏర్పాటు చేశారు. సీటీ, అల్ట్రాసౌండ్ స్కాన్ సదుపాయాలు అందుబాటులోకి తెచ్చారు. ఒకప్పుడు కేవలం ఎముకల శస్త్రచికిత్సలు, ప్రసవాలకే పరిమితమైన ఖని ఆసుపత్రిలో చెవి, ముక్కు, గొంతు శస్త్రచికిత్సలు సైతం చేస్తున్నారు. త్వరలో ఆసుపత్రి ప్రధాన భవనంలో నేత్ర శస్త్రచికిత్స విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు. నగరాలకే పరిమితమైన యూరాలజీ, న్యూరో, మానసిక వైద్యసేవలు ఖని ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చాయి. నూతన భవనంలో ప్రత్యేక ఐసీయూ కేంద్రం ఏర్పాటుకు, ఆయా విభాగాలకు అవసరమైన వైద్య పరికరాలను తెప్పించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

## రాయితీ వినియోగం 35 శాతమే..!

సూర్యాపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వాహన చలానా రాయితీని ఇప్పటి వరకు జిల్లాలో 35 శాతం మంది వాహనదారులు మాత్రమే వినియోగించుకొని లబ్ధిపొందారు. రహదారి ఉల్లంఘనలకు పాల్పడ్డ వాహనదారులపై పోలీసులు ఈ-చలానాల పేరుతో జరిమానాలు విధించారు. వీటి చెల్లింపునకు కాంగ్రెస్ సర్కారు భారీ రాయితీని ప్రకటించింది. ఆ అవకాశాన్ని వినియోగించుకొని కొంత మంది చోదకులు కేసుల నుంచి విముక్తి పొందారు. 2022 మార్చిలోనూ ఇదేవిధంగా ఈ-చలానా జరిమానాలపై రాయితీ ప్రకటించగా అప్పట్లో భారీ సంఖ్యలో వాహనదారులు ఆ సౌలభ్యాన్ని సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందారు. ప్రస్తుతం నూతన సర్కారు సైతం మరోసారి ఈ-చలానా జరిమానాలను రాయితీతో చెల్లించాలని గతేడాది డిసెంబరు 26 నుంచి అవకాశం కల్పించింది. మొదట జనవరి 10 వరకు గడువు విధించారు. వాహనదారుల నుంచి పూర్తిస్థాయి స్పందన లభించకపోవడంతో జనవరి 31 వరకు, రెండో సారి ఈ నెల 15 వరకు గడువు పెంచారు.రూ.2.18 కోట్ల ఆదాయం రాక వన్‌టైం సెటిల్‌మెంట్‌లో భాగంగా ద్విచక్ర వాహనదారులు 20 శాతం, ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లు 10 శాతం, నాలుగు చక్రాల వాహనాలు, కార్లు 40 శాతం, లారీలు, భారీ వాహనాల వారు 50 శాతం చెల్లించి కేసుల నుంచి ఉపశమనం పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. రహదారి ఉల్లంఘనలకు పాల్పడ్డ వాహనదారులపై పోలీసులు విధించిన జరిమానాలో రాయితీ పోను ఈ మేరకు చెల్లించడానికి అవకాశం ఇచ్చారు. దీన్ని జిల్లాలో జనవరి చివరి నాటికి 2.45 లక్షల మంది వాహనదారులు వినియోగించుకున్నారు.

## ఆదిలోనే హంసపాదు

కోనరావుపేట: గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యం మెరుగుప రచడానికి, వాహనదారులు, రైతుల ఇబ్బందులు తొలగించడానికి ప్రభుత్వం హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. అయితే దీని నిర్మాణానికి కొద్దిమేర భూసమస్య తలెత్తింది. దీనిని పరిష్కరించాల్సిన పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో మంజూరైనా పనులు ముందుకు సాగని దుస్థితి నెలకొంది. కోనరావుపేట మండలం నిమ్మపల్లి, గొల్లపల్లి, కొండాపూర్, వెంకట్రావుపేట, నిజామాబాద్, కనగర్తి, పల్లిమక్త, సుద్దాల గ్రామాలను కలిపే నందికమాన్ రెండు వరుసల తారు రోడ్డు అనుసంధానానికి సుమారు 16 కిలోమీటర్ల మేర అప్పటి కరీంనగర్ ఎంపీ, ప్రస్తుత రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తారు రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. కొండాపూర్-వెంకట్రావుపేట గ్రామాల మధ్య పెంటివాగులో లోలెవల్ కల్వర్టు నిర్మించారు. భారీ వర్షాలకు లోలెవల్ కల్వర్టు పైపులైను కొట్టుకుపోవడంతో ఏటా తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం పరిపాటిగా మారింది. వర్షాకాలంలో రెండు, మూడు నెలలు ఈ ప్రధాన మార్గంలో రాకపోకలు నిలిచిపోయి రైతులు, వాహనదా రులు ఇబ్బంది పడుతున్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రెండేళ్ల క్రితం ఎంఆర్ఆర్ నిధులు రూ. 5.01 కోట్లు మంజూరయ్యాయి. గుత్తేదారు ఖరారు ప్రక్రియ ఆలస్యం కావడంతో వర్షాలు కురిసి పనులకు అంతరాయం ఏర్పడింది. గత ఏడాది బ్రిడ్జి నిర్మాణ పనులకు అప్పటి ఎమ్మెల్యే రమేశ్‌బాబు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌లు శిలాఫలకం వేశారు. గుత్తేదారు నిర్మాణ సామగ్రి తరలించి పనులకు శ్రీకారం చుట్టారు. బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా 5 పిల్లర్లు వేయాల్సి ఉండగా చివరి పిల్లరు సమీపంలోని పట్టాదారు భూమిలో వేయాల్సి రావడంతో సదరు వ్యక్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. పనులు ముందుకు సాగడానికి 0.01 గుంట భూమి అవసరం. సమస్య పరిష్కరించాల్సిన అధికారులు, పాలకులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ఏడాదిగా పనులు నిలిచిపోయి సమస్య పరిష్కారం కాని దుస్థితి నెలకొంది.

ఏటా ఇబ్బందులే..ప్రజలు, వాహనదారులు వేములవాడ, సిరిసిల్ల, కరీంనగర్ పట్టణాలకు నందికమాన్ మీదుగా వెళ్తే ట్రాఫిక్ సమస్యలు ఉండవు. కానీ తాత్కాలిక లోలెవల్ కల్వర్టు మరమ్మతులతో ఏటా వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం తప్పడం లేదు. అధికారులు బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.
దొంతరవేణి శ్రీనివాస్‌గౌడ్, వాహనదారుడు, నిమ్మపల్లి

అధికారులకు సహకరించాలి

పెంటివాగు హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు సజావుగా సాగడానికి ఉన్నతాధికారులు ప్రత్యేక ఇంజినీరును (ఏఈ) కేటాయించారు. భూ సమస్య తలెత్తడటంతో నిర్మాణం నిలిచింది. పట్టా భూమి సమస్య పరిష్కారానికి కొండాపూర్, వెంకట్రావుపేట స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపి అధికారులకు, గుత్తేదారుకు సహకరించాలి. అంజయ్య, ఏఈ పీఆర్, కోనరావుపేట

# నిబంధనలకు పాతర.. అక్రమాల జాతర



కరీంనగర్ : ఇటీవల వావిలాలపల్లిలో అనుమతులకు విరుద్ధంగా, సెట్‌బ్యాక్ లేకుండా అనధికారికంగా నిర్మించారని ఆ ప్రాంతవాసి కోర్టును ఆశ్రయించడంతో ఆ భవనాన్ని పట్టణ ప్రణాళిక అధికారులు కూల్చివేశారు. పలు ఫిర్యాదులు రాగా టాస్క్‌ఫోర్స్ ద్వారా కొన్నింటిని నేలమట్టం చేశారు. నిత్యం వేల సంఖ్యలో రాకపోకలు సాగించే ప్రభుత్వాసుపత్రి చుట్టూ వాణిజ్య అవసరాలకు వినియోగించే భవనాలు ఉన్నాయి. వీటన్నింటికి సెల్లార్లు ఉన్నా వాడకుండా రోడ్ల మీదనే వాహనాలు పార్కింగ్ చేయిస్తున్నారు. వాణిజ్య సంస్థల సముదాయాలకు సెల్లార్లు నిర్మించినా ఇతర అవసరాలకు వాడుతున్నారు. కొన్నింటిని అయితే వినియోగించుకోకుండా మూసివేశారు. ఏళ్ల తరబడి అలాగే మూతబడిన వాటిని మాత్రం తెరవడం లేదు. టౌన్‌ప్లానింగ్ అధికారులకు తెలిసినా పట్టనట్లుగా ఉంటున్నారు.

హైదరాబాద్, వరంగల్ తర్వాత కరీంనగర్ పెద్ద నగరంగా గుర్తింపు పొందగా నివాసిత, వాణిజ్య అవసరాల భవన నిర్మాణాల విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. భవిష్యత్తు అవసరాలు, రద్దీని పరిగణనలోకి తీసుకొని వాటిని నిర్మించుకోవాల్సి ఉండగా.. అదేదీ పట్టనట్లుగా కరీంనగర్ కార్పొరేషన్ నుంచి పొందిన నక్ష(ప్లాన్)కు విరుద్ధంగా యథేచ్ఛగా నిర్మాణాలు చేసుకుంటున్నారు. అయిదారేళ్లుగా బహుళ అంతస్తులు, నివాసిత, వాణిజ్య భవన నిర్మాణాలపై వందల సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయి. సెల్లార్‌లో దుకాణాలు, ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు (ఓసీ) తీసుకోకుండానే అందులో వ్యాపారాలు సాగిస్తున్నారు.

పరిశీలించకపోవడంతోనే..

అసలే నగరం కుదించుకుపోతుంది. వ్యాపార, వాణిజ్య సముదాయాలన్నీ ఒకే చోట ఏర్పాటు చేస్తుండటం, ఆ ప్రాంతాల్లోనే నూతన భవనాలు నిర్మిస్తుండటంతో రాకపోకలు సాగించే ప్రజలతో ట్రాఫిక్ పెరిగింది. అనుమతులు తీసుకున్న తర్వాత నిర్మాణాలు పరిశీలించకపోవడంతోనే అసలు సమస్యకు కారణంగా మారుతోంది. సెట్‌బ్యాక్ లేకపోవడం, మెట్లు బయటకు రావడం, గేట్లు రోడ్డు వైపు తెరచుకోవడం, ఆక్రమణ వంటివి పట్టణ ప్రణాళిక విభాగానికి కనిపించడంలేదు. ఫిర్యాదులు వస్తే నోటీసు ఇస్తున్నారు. తర్వాత చర్యలు ఉండటం లేదు.

నియమాలు ఇవి..

కమర్షియల్ భవన అనుమతిలో సిల్ట్ ఫ్లోర్‌ను పూర్తిగా పార్కింగ్‌కు వినియోగించుకోవాలి.

వాణిజ్య భవనాలకు కచ్చితంగా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందాలి.

వాణిజ్య భవనాలకు సెట్‌బ్యాక్ పాటించాలి. 40 అడుగుల రోడ్డు ఉండాలి.

40 అడుగుల రహదారిలో 10 ఫీట్లు, 40 నుంచి 60 అడుగులకు అయితే 13.5 ఫీట్లు, 60-80 అడుగులకు అయితే 18 ఫీట్లు, 80 అడుగులకు అయితే 20 ఫీట్లు సెట్‌బ్యాక్ పాటించాలి.

దుకాణాల కోసం షెట్టర్లు నిర్మిస్తే ప్లాన్‌లో సూచించిన విధంగా సెట్‌బ్యాక్ వది వాహనాల పార్కింగ్‌కు వాడాలి.

ఆసుపత్రి భవన నిర్మాణ సమయంలోనే పార్కింగ్ స్థలం చూపిస్తేనే అనుమతి ఇవ్వాలి.

అగ్నిమాపక వాహనం సాఫీగా వచ్చేలా ఉండాలి.

రహదారులే పార్కింగ్ స్థలాలుగా..

రూ. కోట్లు ఖర్చు చేసి నగరంలో రహదారులు వెడల్పు చేసి ఆధునికీకరించారు.

పాదచారులకు ఇబ్బందులు లేకుండా నడకదారి నిర్మించి, లైటింగ్ ఏర్పాటు చేశారు.

దుకాణాలు, హోటళ్లు, కల్యాణ మండపాలు, చిన్న అతిథిగృహాలు, ఆసుపత్రుల ఎదుట వాహనాలు నిలుపుతుండటంతో రోడ్లు పార్కింగ్ స్థలాలుగా కనిపిస్తున్నాయి.

ఎప్పటికప్పుడు చర్యలు..

క్షేత్రస్థాయిలో నిబంధనలు ఉల్లంఘించినట్లు ఫిర్యాదులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్ పోలీసులు, టౌన్‌ప్లానింగ్ సాయంతో సెల్లార్లు తెరిచేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం. ప్రస్తుతం రహదారులపై ఉన్న ఆక్రమణలు తొలగిస్తున్నాం. సుభాష్, డీసీపీ, కరీంనగర్ నగరపాలిక

## అమృత్ మాలతో ఆకట్టుకునేలా.

రామగుండం: రైలు ప్రయాణం మరింత సౌకర్యంగా ఉండడానికి రైల్వేస్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 'భారత్ అమృత్ మాల' పథకాన్ని ప్రవేశపెట్టింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అతిపెద్ద రైల్వేస్టేషన్ అయిన రామగుండంలో ఈ పథకం కింద స్టేషన్ ప్రాంగణాన్ని విమానాశ్రయం తరహాలో ఆకట్టుకునేలా నిర్మిస్తున్నారు. రూ. 26.50 కోట్లతో చేపడుతున్న పనులతో ఆధునిక హంగులు సమకూరనున్నాయి. దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్‌లోని కాజీపేట-బల్లార్షా సెక్షన్‌లో రైల్వేకు గూడ్స్ రవాణాపరంగా రోజూ రూ. కోట్లలో ఆదాయాన్ని రామగుండం రైల్వేస్టేషన్ సమకూరుస్తోంది. సుమారు వందకుపైగా రైళ్లు ఇక్కడ ఆగుతాయి. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. ప్రయాణికుల రాకపోకల సంఖ్య, ఆదాయం ఆశించిన మేర లేదనే కారణంతో ఇన్నేళ్లుగా ఈ స్టేషన్ అభివృద్ధికి నోచుకోలేదు. ప్రయాణికుల రద్దీ పెరుగుతున్న వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వలేదు. గతేడాది ఆగస్టు 6న ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ప్రయాణికులకు పూర్తిస్థాయి సౌకర్యాలు, రైల్వేస్టేషన్‌కు ఆధునిక హంగులు కల్పించేలా నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

ప్లాట్‌ఫాంలపై పూర్తిస్థాయి సౌకర్యాలు

ఒకటో ప్లాట్‌ఫాంపై నిరీక్షణ గదులను ఆధునికీకరిస్తున్నారు. ఎ.సి. సదుపాయంతో పెయిడ్ వీఐపీ లాంజ్, మహిళలు, సాధారణ ప్రయాణికులకు వేర్వేరుగా నిరీక్షణ గదుల పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 1, 2, 3వ ప్లాట్‌ఫాంలపై ఖాళీ ప్రదేశాల్లో పైకప్పు షెడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. 2, 3వ ప్లాట్‌ఫాంల నుంచి 1వ ప్లాట్‌ఫాం ట్రాక్‌ల మీదుగా స్టేషన్ బయటి వరకు 25 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్‌వోబీ) నిర్మాణం కోసం



ప్లాట్‌ఫాంలపై పునాది తవ్వారు. ఈ వంతెనకు ఇరువైపులా ఎస్కలేటర్లు, లిఫ్టులు, ర్యాంపులు ఏర్పాటు చేయనున్నారు. రైలు దిగిన ప్రయాణికులు సులువుగా బయటకు వెళ్లేందుకు, వృద్ధులు, మహిళలు, చిన్నారులు ప్లాట్‌ఫాంలను దాటేందుకు ఈ వంతెన ఉపయోగపడేలా నిర్మిస్తున్నారు. ప్లాట్‌ఫాంలు, స్టేషన్ బయట ఆధునాతన శౌచాలయాలను నిర్మిస్తున్నారు.

వాహనాల పార్కింగ్‌కు ప్రాధాన్యం

ద్విచక్ర, త్రిచక్ర, 4 చక్రాల వాహనాలకు వేర్వేరుగా పార్కింగ్ ప్రదేశాలు కేటాయించి షెడ్లు నిర్మిస్తున్నారు. ఈ వాహనాలు స్టేషన్ లోపలికి వచ్చి తిరిగి వెళ్లేందుకు స్వాగత తోరణం నుంచి ముఖ ద్వారం వరకు వేర్వేరుగా దారులు, పాదచారులు నడిచేందుకు పైకప్పుతో దారులు, మధ్యలో డివైడర్లు నిర్మిస్తున్నారు. ప్రధానంగా స్టేషన్ ఎదుట ప్రాంగణాన్ని విమానాశ్రయం మాదిరిగా విశాలంగా మార్చేందుకు ప్రస్తుత భవనం ముందు భాగాన్ని పునర్నిర్మిస్తున్నారు. ముఖద్వారం ఎదుట ప్రయాణికులు దిగేందుకు, ఎక్కేందుకు వీలుగా పైకప్పు నిర్మిస్తున్నారు. స్టేషన్ లోపల, బయట సి.సి. కెమెరాలు, ఎల్ఈడీ బోర్డులు, డిజిటల్ తెరలు, విద్యుత్తు దీపాలు, ఉద్యానవనాలు, దుకాణ సముదాయాలు, టికెట్ కౌంటర్ల వద్ద కుర్చీలను ఏర్పాటు చేస్తున్నారు. స్టేషన్ ముందు వైపున జాతీయ జెండా, స్థానికతకు గుర్తుగా 2 చారిత్రక చిహ్నాలను అమర్చనున్నారు. రైల్వే ఉన్నతాధికారులు పనులను పర్యవేక్షించి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేసేలా చొరవ చూపాలని రామగుండం నగరవాసులు కోరుతున్నారు.

## అవకాశాలున్నా.. అంతులేని జాప్యం

సిరిసిల్ల: రాజరాజేశ్వర జలాశయ నిర్మాణంలో పదకొండు గ్రామాలు ముంపునకు గురయ్యాయి. పరిహారం పంపిణీ, నివాసాల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. కానీ ఉన్న ఊరిలో ఉపాధి కరవైంది. జీవనోపాధి కోసం పట్టణాలకు వలస వెళ్తున్నారు. పదేళ్లుగా నిర్వాసితుల ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే అంశాలేవీ కార్యరూపం దాల్చలేదు. ఇటీవల రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి జిల్లా ఉన్నతాధికారుల సమీక్షలో ముంపు గ్రామాల్లోని యువత ఉపాధి అవకాశాలపై చర్చ జరిగింది. రాష్ట్రానికి జలకూడలిగా ఉన్న రాజరాజేశ్వర జలాశయంలో ఏడాది పొడవునా నీరు అందుబాటులో ఉంటుంది. పరిశ్రమలు, మత్స్యశాఖలు సంయుక్తంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతోపాటు కేంద్ర ప్రభుత్వ పథకాల్లోనూ అర్హులుగా చేర్చాలని అధికారులకు మంత్రి సూచించారు.

జిల్లాలో వర్షాకాలం తర్వాత 435 చెరువుల్లో 1.38 కోట్ల పిల్లలు, 40 లక్షల రొయ్య పిల్లలను వదిలారు. వీటి ద్వారా ఎనిమిది టన్నుల చేప, రొయ్య పిల్లల ఉత్పత్తి జరుగుతుంది. మత్స్యకారులకు రూ. 14 లక్షల ఆదాయం సమకూరుతుంది. ఉచిత చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం గుత్తేదారుల సంస్థలకు ఏటా సగటున రూ. 2 కోట్ల వరకు వెచ్చిస్తోంది. ఎగువమానేరు జలాశయం సమీపంలో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం ఉన్నా దాని సామర్థ్యం 20 లక్షల వరకే ఉంది. అందులోనూ సిబ్బంది ఉంటేనే పిల్లల ఉత్పత్తి సాధ్యమవుతుంది. ఏటా చేప, రొయ్య పిల్లలు కొనుగోలు చేసేందుకు అయ్యే ఖర్చును తగ్గించుకునేందుకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజనను సద్వినియోగం చేసుకోవాలని భావిస్తున్నారు. దీంతో స్థానికంగానే జిల్లా మత్స్య సంపదను పెంచుకునే అవకాశం ఉంది. డిమాండ్‌కు తగ్గట్టుగా చేప పిల్లలు పెంచుకుని వాటిని జలాశయాలు, గ్రామాల వారీగా పంపిణీ చేయవచ్చు. దీంతోపాటు చేపల ఉత్పత్తి పెరగడం, స్థానికంగా మార్కెట్లతోపాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసుకునే అవకాశం ఉంది.

మంజూరు కాని నిధులు

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద జిల్లా వ్యాప్తంగా అర్హులైన మత్స్యకారుల నుంచి వివిధ యూనిట్లకు కలిపి మొత్తం 87 దరఖాస్తులు అందాయి. వీటిలో 54 యూనిట్లను మత్స్యశాఖ 2021లోనే గ్రౌండింగ్ పూర్తి చేసింది. జిల్లా నీటిపారుదలశాఖ, డీఏవో, జిల్లా భూగర్భ జలశాఖ, జిల్లా మత్స్యశాఖల అధికారులతో కూడిన కమిటీ ఆమోదం లభించింది. చివరికి కలెక్టర్ అనుమతితో ఎం.బి. రికార్డులు సమర్పించిన ఆరు యూనిట్లకు రూ. 25 లక్షల మంజూరుకు కమిషనర్‌కు ఉత్తర్వులు పంపారు. మొబైల్ ఫిష్ రిటైల్ ఔట్‌లెట్‌ల ఏర్పాటుతో జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణాలు, గ్రామాల్లో విరివిగా చేపల వినియోగం పెరుగుతుంది. పీఎం మత్స్య సంపద యోజన ద్వారా జిల్లాలోని మత్స్యకారులకు మరింత ఉపాధి పెరగనుంది. ఫలితంగా మత్స్యకారుల జీవన స్థితిగతులు మెరుగుపడతాయి. కాగా ఈ యూనిట్లకు ఇప్పటికీ నిధులు మంజూరు కాలేదు.

కేజ్ కల్చర్‌ను ప్రారంభిస్తాం

ముంపు నిర్వాసిత కుటుంబాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు రాజరాజేశ్వర జలాశయంలో రూ. 3 లక్షల వ్యయంతో కేజ్ కల్చర్ విధానంలో చేపల పెంపకాన్ని ప్రారంభించనున్నాం. ఈ విధానంలో చేపల పెంపకం ఇక్కడి మత్స్యకారులకు మొదటిసారి. తొలుత ఈ విధానంపై మత్స్యకారులకు అవగాహన కల్పిస్తాం. మంచి ఫలితాలు సాధిస్తే జలాశయం సమీపంలోని అన్ని సంఘాలకు ఈ విధానం విస్తరించేలా ప్రణాళికలు చేస్తాం. మత్స్య సంపద వృద్ధి చెందడంతోపాటు ఏడాది పొడవునా ఉపాధి లభిస్తుంది. శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి

# రవాణా శాఖ కార్యాలయాలు గాడిన పడేనా?



కరీంనగర్ : ప్రభుత్వ ఆదాయంలో రవాణా శాఖది కీలకపాత్ర. ఈ శాఖ నుంచి సర్కారుకు ఏటా రూ. కోట్ల ఆదాయం వస్తున్నా.. కార్యాలయాల్లో మాత్రం సమస్యలు కనిపిస్తున్నాయి. వసతులు కల్పించడంలో జాప్యమవుతోంది. ఉమ్మడి జిల్లాలో అన్ని చోట్ల తాత్కాలిక సౌకర్యాలతో నెట్టుకొస్తున్నారు. ఈసారి జిల్లాకు చెందిన పొన్నం ప్రభాకర్ రవాణా శాఖ మంత్రిగా ఉండడంతో.. ఆయన పట్టించుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖ కార్యాలయాల పరిస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం.

ఉమ్మడి జిల్లాలో..కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాలల్లో రవాణా శాఖ కార్యాలయాలు.. హుజూరాబాద్, రామగుండం, కోరుట్లలో యూనిట్ కార్యాలయాల ద్వారా వాహనదారులకు సేవలు అందుతున్నాయి. నిత్యం వీటి వద్దకు వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, సామర్థ్య పరీక్షలు, వాహన బదిలీ తదితర పనుల కోసం అనేక మంది వస్తుంటారు. ఆ సేవల ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ. లక్షలు సమకూరుతున్నాయి. అలాంటి శాఖ కార్యాలయాలు అరకొర వసతుల మధ్య ఉన్నాయి.

ప్రతిపాదనలకే పరిమితం

కరీంనగర్ జిల్లా రవాణా కార్యాలయ ట్రాక్ మిగిలిన పనులకు మూడేళ్ల కిందట రూ. 15 లక్షల వరకు నిధులు అవసరమవుతాయని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించగా.. ఇంకా మంజూరు కాలేదు. అంచనాలు సమగ్రంగా రూపొందించి మరోమారు ప్రభుత్వానికి ప్రతిపాదిస్తే నిధులు మంజూరయ్యే అవకాశముంది. రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, రవాణా శాఖ మంత్రిగా జిల్లాకు చెందిన పొన్నం ప్రభాకర్ ఉండడంతో నిధుల మంజూరు చేసే అవకాశముంది.

అద్దె భవనాలు.. అరకొర వసతులు

ఉమ్మడి జిల్లాలో కరీంనగర్ మినహా మిగతా అన్ని జిల్లాల రవాణా, యూనిట్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. తిమ్మాపూర్‌లోని కరీంనగర్ జిల్లా రవాణా కార్యాలయం ఆవరణలో 2018లో రూ. 50 లక్షలతో నిర్మించిన డ్రైవింగ్ ట్రాక్ తారు లేచి, గడ్డి, చెట్లపొదలతో అధ్వానంగా తయారైంది. ట్రాక్ నిర్మాణం పూర్తై ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ, రహదారి నిబంధనల నామఫలకాల ఏర్పాటులో జాప్యంతో నేటికి అందుబాటులోకి రాలేదు. కొద్దిపాటి నిధులు వెచ్చించి అవసరమైన ఏర్పాట్లు చేస్తే డ్రైవింగ్ లైసెన్స్ పరీక్షకు ఇబ్బందులు ఉండవు. శాశ్వత డ్రైవింగ్ ట్రాక్ లేకపోవడంతో ప్రస్తుతం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి ట్రాక్‌పై పరీక్షలు నిర్వహిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లోనూ తాత్కాలిక ట్రాక్‌పైనే చోదక పరీక్షలు చేస్తున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

ఉమ్మడి జిల్లా పరిధిలోని రవాణా శాఖ కార్యాలయాలకు త్వరలోనే సొంత భవనాలను అందుబాటులోకి తెస్తాం. రాష్ట్రంలోని అన్ని రవాణా శాఖ కార్యాలయాల్లో మౌలిక వసతుల కల్పన, టెక్నాలజీ అప్‌గ్రేడ్ తదితర పనులకు రూ. 150 కోట్లు కేటాయిస్తాం. కరీంనగర్ రవాణా కార్యాలయంలో డ్రైవింగ్ ట్రాక్‌ను అందుబాటులోకి తేవడానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తాం. ఆధునికీకరణ పనులు చేపడతాం. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

## గడువు పెంచక.. గమ్యం తెలియక..!

హుజూర్‌నగర్ : సీఎంఆర్ ప్రక్రియ నిలిచిపోయింది. కేంద్రం నుంచి బకాయి బియ్యం సేకరణలపై ఉత్తర్వులు లేకపోవడంతో రాష్ట్రంలో అధికారులు కూడా సేకరణలు నిలిపివేశారు. గత నెల 31తో గడువు ముగియడంతో ఆగిన బియ్యం సేకరణలు.. వారం రోజులైనా ఉత్తర్వులు లేకపోవడంతో అధికారులు, మిల్లర్లు మీనమేశాలు లెక్కిస్తున్నారు. మిల్లర్లను బకాయి బియ్యం పెట్టాలని ఒత్తిడి చేయాలా.. వద్దా, అయితే బకాయి బియ్యం పరిస్థితి ఏమిటని అందరిలో మెదులుతున్న ప్రశ్న. భారీగా బకాయి పడ్డ మిల్లుల నుంచి నెమ్మదిగా బకాయిలు వసూలు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఉన్న బకాయిలు వసూలు చేయడంతోపాటు ఇకపై బకాయిలు లేకుండా చేయాలని అధికారులు చేస్తున్న ప్రయత్నాలకు ప్రస్తుత పరిస్థితులతో బ్రేకు పడినట్లు అయింది.

వసూలు ఎలా..కేంద్ర ప్రభుత్వం బకాయి సీఎంఆర్ బియ్యం వసూలుపై



గడువు పెంచకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే పౌరసరఫరాలశాఖ అప్పుల ఊబిలో ఉన్న క్రమంలో దాన్ని దారిలో పెట్టేందుకు అనేక చర్యలు తీసుకుంటున్న తరుణంలో గడువు పెంపు సమస్య రావడంతో రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి ఇరకాటంలో పడింది. కేంద్రం అనుమతి లేకపోవడంతో బియ్యం సేకరణలు చేయడం సాధ్యం కాదు. రాష్ట్రంలో భారీగా ఎలాంటి గ్యారంటీలు లేకుండా రూ. కోట్ల విలువ చేసే సీఎంఆర్ ధాన్యం కేటాయింపులు జరిగినందున నెమ్మదిగా బియ్యం వసూలు చేయాలని అధికారులు నిర్ణయించారు. పురోగతి ఉన్న మిల్లులకు మరికొంత గడువు ఇస్తూ సాధ్యమైనంత వరకు బకాయిలు వసూలు చేయాలని అధికారులు చర్యలు తీసుకున్నారు. మరీ మొండి బకాయిదారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జప్తులు, క్రిమినల్ కేసులు నమోదు చేసైనా బకాయిలు వసూలు చేయలని అధికారులు చూస్తున్నారు. గత నెలాఖరు నాటికి ఒక్క ఉమ్మడి నల్గొండ జిల్లాలో 2022-23 యాసంగి లక్ష్యంలో ఇంకా 6,45,720 మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణలు చేయాల్సి ఉంది.

# మినీ స్టేడియం నిర్మాణ పనుల్లో జాప్యం

కరీంనగర్ : హుజూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో చేపడుతున్న మినీ స్టేడియం పనులు నత్తనడకన సాగుతున్నాయి. శంకుస్థాపన చేసి నెలలు గడిచిన నిర్మాణ పనుల్లో జాప్యం వీడటం లేదు. ఈ మధ్యనే క్రీడా సామగ్రి భద్రపరుచుకునే గదుల నిర్మాణం ప్రారంభించారు. అయిన పనులను పర్యవేక్షించే నాధుడే కరవయ్యాడని, అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయిందని పలువురు ఆరోపిస్తున్నారు.

అరకొర వసతులతో సాధన ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో రోజూ జాతీయ స్థాయి క్రీడాకారులు సాధన చేస్తుంటారు. మైదానంలో ఉన్న అరకొర వసతులతో సద్వినియోగం చేసుకుంటూ క్రీడాకారులు ఆటల్లో రాణిస్తున్నారు. క్రీడా సామగ్రిని భద్రపర్చుకునేందుకు గదులు, సరైన విద్యుత్తు సౌకర్యం లేదు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు వినియోగంలో లేవు.

రూ. 10 కోట్లు.. చేపట్టబోయే పనులు 5ఎకరాల స్థలంలో మినీ స్టేడియం నిర్మాణ పనులకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ ఎస్‌డీఎఫ్ గ్రాంటు కింద రూ. 10 కోట్లు మంజూరు చేసింది. గత సంవత్సరం సెప్టెంబర్ 13న అప్పటి ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. టెండర్ ప్రక్రియ పూర్తి చేసి.. గుత్తేదారుకు రూ. 7.11కోట్ల పనులు అప్పగించారు. మైదానం ముందు ఓ ఆర్చరీ, హాకీ,



టెన్నిస్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ కోర్టులను నిర్మించేలా ప్రణాళిక వేశారు. ప్రతి కోర్టు చుట్టూ ఇనుప తీగల కంచెలను ఏర్పాటు చేయనున్నారు. 183 స్క్వేర్ మీటర్ల వెడల్పుతో ప్రేక్షకులు కూర్చునేందుకు సిట్టింగ్ గ్యాలరీ నిర్మాణాన్ని రూపొందించారు. స్టేడియంలో వర్షపు నీరు నిలువ కుండా ప్రత్యేక కాలువను నిర్మించనున్నారు. కార్యాలయ భవనాన్ని, వాకింగ్ ట్రాక్ నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు.

త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం: గందె రాధిక, ఛైర్‌పర్సన్

గుత్తేదారుతో మాట్లాడి ఆరు నెలల్లో స్టేడియం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. స్టేడియం నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెడుతాం. త్వరలోనే క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొస్తాం.

# గాడి తప్పుతున్న జీసీసీ సేవలు

ములుగు : గిరిజనుల ఆర్థిక స్వావలంబన, గ్రామీణులకు పలు రకాల సేవలందించాల్సిన జీసీసీపై పర్యవేక్షణ కొరవడింది. వెంకటాపురం కేంద్రంగా నిర్వహిస్తున్న గిరిజన ప్రాథమిక సహకార మార్కెటింగ్ సంఘం పనితీరు గాడితప్పింది. ఈ కార్యాలయానికి కీలకమైన అధికారి పోస్టు ఖాళీగా ఉండటం, ఇన్‌ఛార్జి పాలనలో కొనసాగుతుండటంతో విధి నిర్వహణ భారంగా మారింది. వెంకటాపురం, వాజేడు మండలాల్లో రేషన్ షాపులు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు చౌకబియ్యం, సన్నబియ్యం, నిత్యావసర సామగ్రి ఇక్కడి నుంచే సరఫరా జరుగుతోంది. ఈ సేవలపై అజమాయిషీ లేకపోవడంతో పలువురు ఆధిపత్యం చూస్తూ సేవలను పక్కదారి పట్టిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

భర్తీకి నోచుకోని పోస్టులు

వెంకటాపురం జీపీఎస్ఎంఎస్ కార్యాలయానికి చెందిన ప్రధాన అధికారి మేనేజర్ పోస్టు ఏడాదికి పైగా భర్తీకి నోచుకోలేదు. ఏటూరు నాగారానికి చెందిన అధికారికి అదనపు బాధ్యతలతో నెట్టుకొస్తున్నారు.



ఈ కార్యాలయం పరిధిలో వాజేడు, వెంకటాపురం మండలాల్లో 18 చౌకదుకాణాలు నిర్వహిస్తుండగా వెంగళరావుపేట, మరికాల, జగన్నాథపురం, గొల్లగూడెం, కడేకల్, గంగారం డిపోలకు సంబంధించి సేల్స్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సమీపంలోని ఉద్యోగులకు అదనపు బాధ్యతలు అప్పగించి కొనసాగిస్తున్నారు. దీంతో ఆ పరిధిలోని కార్డుదారులకు సకాలంలో ప్రజాపంపిణీ బియ్యం అందని పరిస్థితి ఉంది. కార్యాలయానికి చెందిన లారీకి శాశ్వత డ్రైవర్ పోస్టు ఖాళీగా ఉండటంతో ప్రైవేటు వ్యక్తితో నెట్టుకొస్తున్నారు.

బంకు నిర్వహణకు పన్నుపోటు

సంస్థకు ఆదాయ వనరుగా మలచుకునే ఉద్దేశంతో వీరభద్రవరంలో పెట్రోల్ బంకును ఏర్పాటు చేశారు. అధికారుల అనాలోచిత నిర్ణయాలతో బంకు నిర్వహణపై అదాయ పన్నుపోటు భారంగా మారింది. వార్షిక లావాదేవీలు పరిధి దాటడంతో ఇంధనం కొనుగోలు క్రమంలో పన్ను చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. 12 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన పెట్రోల్, డీజిల్‌ను ఒక దఫా కొనుగోలు చేసేందుకు రూ. 12.32 లక్షలు వెచ్చించాల్సి ఉండగా ఆదాయ పన్ను రూపంలో అదనంగా ప్రతి సారి రూ. 50 వేలకు పైగా భారం మోయాల్సి వస్తోంది. మూడు నెలలుగా సుమారు రూ. 5 లక్షలు సంస్థ ద్వారా చెల్లించాల్సిన పరిస్థితి నెలకొన్నా ఆ సమస్యను కొలిక్కి తేవడంలో యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కార్యాలయానికి గతంలో ప్రభుత్వం అందజేసిన జీపు కాలం చెల్లడం, మరమ్మతులకు గురవ్వడంతో మూలనపెట్టారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పుపడుతోంది. కార్యాలయం భవనంతో పాటు పలు చౌకదుకాణాలకు చెందిన భవనాలు శిథిలావస్థకు చేరాయి. వానాకాలంలో బియ్యం, నిత్యావసర సామగ్రిని భద్రపరచడం కష్టంగానే ఉంది.

# సఖి ఉంది అండగా..

వరంగల్ : సమాజంలో వివక్ష ఎదుర్కొంటున్న మహిళాలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సఖి/వన్‌స్టాప్ కేంద్రం ఏర్పాటు చేసింది. స్వచ్ఛంద సంస్థ సహకారంతో హనుమకొండ జిల్లా కేంద్రంలో ఎక్సైజ్‌కాలనీలో సఖి కేంద్రాన్ని 2017 డిసెంబరులో ఏర్పాటు చేశారు. 24 గంటలు పని చేసే ఈ కేంద్రంలో 14 మంది మహిళా సిబ్బంది అందుబాటులో ఉంటారు. వేధింపులకు గురైన బాధితులకు ఆశ్రయం కల్పించి భరోసా ఇస్తారు. కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు. 8 అంశాల్లో సేవలందిస్తున్నారు. స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, పోలీసు అధికారులు, బాధిత మహిళలకు అండగా ఉంటున్నారు. 181 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి కూడా ఫిర్యాదు చేయొచ్చు.

కేసుల నమోదు...

మహిళలు లైంగిక, వరకట్న వేధింపులు, ఈవ్‌టీజింగ్‌కు గురైన సమయంలో కేంద్రానికి వచ్చి ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు నమోదు చేస్తారు. వారికి పూర్తి సహకారం అందించేందుకు పోలీసు సిబ్బంది ఉంటారు. అన్ని విధాలా సేవలందిస్తారు.

పోలీసు ప్రాసిక్యూషన్ సర్వీసు

బాధిత మహిళలకు పోలీసు అధికారులు రక్షణ ఇవ్వడంతో పాటు వారికి కేసుకు అవసరమైన సలహాలు ఇస్తారు. సంబంధిత ఠాణాల్లో కేసు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటారు. అవసరమైన సాక్షులను కోర్టులో ప్రవేశపెడతారు. బాధిత కుటుంబానికి పూర్తి అండగా ఉంటూ కేసు పూర్తయ్యే వరకు సహకారం అందిస్తారు.

కౌన్సెలింగ్

మహిళల్లో మానసిక ధైర్యం నింపుతారు. సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు అవసరమైన కౌన్సెలింగ్ ఇస్తారు. మానసిక వైద్య నిపుణులు అందుబాటులో ఉండి పూర్తి సహాయం అందిస్తారు.

న్యాయపరమైన సలహాలు

సఖి/వన్‌స్టాప్ కేంద్రంలోని మహిళలకు ఉచితంగా న్యాయసలహాలు ఇస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా న్యాయనిపుణులు ఉంటారు. నిందితులకు శిక్ష పడేలా ప్రయత్నిస్తారు. అవసరమైన సాక్షాల పరిశీలన, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని సత్వరం నాయ్యం అందేలా చూస్తారు.

వైద్య సదుపాయం

సఖి ఆవరణలోనే వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక గది ఉంది. ఇక్కడికి వచ్చిన వారికి వెంటనే వైద్య పరమైన సేవలందిస్తారు. అవసరాన్ని బట్టి ఇతర ఆసుపత్రికి తీసుకెళ్తారు.

పునరావాస కేంద్రం

బాధితులకు పునరావాస కేంద్రంగా ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు వివిధ రకాల కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. వారు స్వయంకృషితో ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తారు.

తక్షణ న్యాయం తక్షిన న్యాయం జరిగేలా విచారణ ఉంటుంది. అవసరమైతే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టుకు రాకుండానే బాధిత మహిళ ఈ కేంద్రం నుంచి వివరాలు చెప్పే అవకాశం ఉంది. ఆమె చెప్పే విషయాలను కోర్టులో నమోదు చేస్తారు. దీని వలన త్వరితగతిన న్యాయం జరుగుతుంది.

కౌన్సెలింగ్ ద్వారా ఒక్కటయ్యారు

జనగామ జిల్లా కేంద్రానికి చెందిన యువతికి వరంగల్‌కు చెందిన యువకుడితో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పిల్లలు లేరు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఆమె సఖి కేంద్రాన్ని సంప్రదించారు. మహిళా సిబ్బంది కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇద్దరు ఒక్కటయ్యారు.

హనుమకొండలో నివాసం ఉంటున్న ప్రైవేటు ఉద్యోగి అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్నాడు. పలుసార్లు పెద్దమనుషుల మధ్య పంచాయితీలు జరిగాయి. కానీ వారిలో మార్పు రాలేదు. సఖి కేంద్రానికి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగికి వరకట్న వేధింపుల చట్టం, ఇతర చట్టాల అంశాల గురించి వివరించి కౌన్సెలింగ్ ఇచ్చారు ఆ తర్వాత ఇద్దరు కలిసి ఉంటున్నారు.

హనుమకొండకు చెందిన మహిళ మతిస్థిమితం కోల్పోయి మరో రాష్ట్రానికి వెళ్లింది. అక్కడి అధికారులు వైద్య సహాయం చేసిన తర్వాత మహిళ తనకు సంబంధించిన వివరాలను చెప్పింది. వెంటనే అధికారులు సఖి కేంద్రాన్ని సంప్రదించారు.

# పారిశుద్ధ్యంతోనే సీజనల్ వ్యాధుల నివారణ




వరంగల్ : జిల్లాలో సరైన పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టడం ద్వారా చాలావరకు సీజనల్ వ్యాధులను నివారించవచ్చని జిల్లా పాలనాధికారి ప్రావీణ్య అన్నారు. మలేరియా, డెంగీ నివారణ కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో ఏ గ్రామాల్లో మలేరియా, డెంగీ కేసులు నమోదు అయ్యాయో వాటిని గుర్తించాలన్నారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి పంచాయతీలో శుక్రవారం డ్రై డేను పాటించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహాల్లో వారంలోగా నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని చెప్పారు. మలేరియా, డెంగీ కేసుల వివరాలను ప్రతిరోజూ నమోదుచేసి ఎప్పటికప్పుడు నివారణ చర్యలను తీసుకోవాలన్నారు. జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు పారిశుద్ధ్య కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరిస్థితులు, ఇంటి పరిసరాలను పరిశీలించి సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. కీటకజనిత వ్యాధుల నివారణపై కరపత్రాలు, గోడ పత్రికలతో విస్తృత ప్రచారం కల్పించాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ, డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ, డీఆర్డీవో సంపత్‌రావు, డీపీవో కల్పన, సంక్షేమశాఖ అధికారి శారద తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి..

నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీల పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల్లో వేగం పెంచి, త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధంచేయాలని జిల్లా పాలనాధికారి ప్రావీణ్య ఆదేశించారు. అభివృద్ధి పనులపై సంబంధిత కమిషనర్‌లతో కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్ధన్నపేటకు సంబంధించి రెండు వైకుంఠ ధామాలు, మున్సిపల్ నూతన భవనం, డీసీ తండాలోని మిని ఫంక్షన్‌హాల్, సమీకృత మార్కెట్ నిర్మాణాలను పూర్తిచేయాలన్నారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య వేడుకలు నూతన మున్సిపల్ భవనంలో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో సమన్వయంతో పనిచేసి అంబేద్కర్ జంక్షన్‌ను పూర్తిచేయాలని, రోజువారీ పురోగతి నివేదిక పంపించాలన్నారు. నర్సంపేట మున్సిపాలిటీకి సంబంధించి ద్వారకాపేట రోడ్‌లోని ఆడిటోరియం, రెండు వైకుంఠ ధామాలు, కుమ్మరి కుంటలోని పట్టణ ప్రకృతివనం, సమీకృత మార్కెట్ నిర్మాణాలను పూర్తిచేయాలని సూచించారు.

పంటల నమోదు ప్రక్రియ పూర్తిచేయండి..

జిల్లాలో పంటల నమోదు ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని, నేరుగా వరి విత్తే విధానాన్ని ప్రోత్సహించాలని జిల్లా పాలనాధికారి ప్రావీణ్య ఆదేశించారు. వ్యవసాయశాఖ అధికారులతో బుధవారం జరిగిన గూగుల్ మీట్‌లో ఆమె మాట్లాడారు. విత్తన దుకాణాల తనిఖీ, నమోదు చేసిన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని పంటల విత్తనాలను డీలర్ దుకాణాల్లో అందుబాటులో ఉంచాలని, ఈపాస్ యంత్రాల ద్వారా మాత్రమే ఎరువుల అమ్మకాలు చేపట్టాలన్నారు. అర్హులైన రైతులందరికీ రైతుబీమా కల్పించాలని, మృతిచెందిన రైతులకు సంబంధించిన బీమా మొత్తాన్ని కుటుంబ సభ్యులకు జాప్యం లేకుండా చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ సహాయ సంచాలకులు, వ్యవసాయ, ఉద్యాన అధికారులు, ఏఈవోలు పాల్గొన్నారు.

# జౌళి పార్కు పనులు వేగవంతం



వరంగల్ : కాకతీయ మెగా జౌళి పార్కు ఇటీవల అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 8న హనుమకొండ సభలో దీని గురించి ప్రస్తావించారు. పీఎం మిత్ర కింద మంజూరు చేశామని అన్నారు. మరో వైపు ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరలో ఇందులో నిర్మిస్తున్న కిటెక్స్ ప్రారంభించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో అసలు జౌళి పార్కుకు ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులెన్ని, కల్పించిన సౌకర్యాలేమిటి? కేంద్ర ప్రభుత్వం ఏ మేర నిధులు ఇవ్వనుందో వివరిస్తూ ప్రత్యేక కథనం.. కాకతీయ మెగా జౌళి పార్కు నిర్మాణం ఇక వేగవంతం కానుంది. 2017లో రాష్ట్ర ప్రభుత్వం ఈ పార్కు కోసం భారీ స్థాయిలో భూసేకరణ చేపట్టి ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. భూమి పూజ జరిగాక అయిదేళ్ల వరకు ఇందులో పరిశ్రమలు ప్రారంభం కాలేదు. గతేడాది రెండు యూనిట్లు ఉత్పత్తి మొదలుపెట్టాయి. రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతుల కోసం రూ. వెయ్యి కోట్లు ప్రకటించగా ఇప్పటి వరకు రూ. 550 కోట్లను కేటాయించింది. ఈ నిధులతో రహదారుల నిర్మాణం, విద్యుత్తు లైన్లు, ఉపకేంద్రాలు, మంచినీటి సరఫరా, ప్రహరీ తదితర పనులు జరుగుతున్నాయి.

'పీఎం మిత్ర' కింద రెండు దశల్లో రూ. 500 కోట్లు

జౌళి పార్కుకు కేంద్ర ప్రభుత్వం రెండు దశల్లో నిధులను ఇవ్వనుంది. మొత్తంగా రూ. 500 కోట్లు 'పీఎం మిత్ర' పథకం ద్వారా కేటాయించేందుకు ఉత్తర్వులు వెలువడ్డాయి. అభివృద్ధి మూలధన మద్దతు (డెవలప్‌మెంట్ కాపిటల్ సపోర్ట్) కింద పార్కు అభివృద్ధి కోసం ఏర్పాటుచేసే ప్రత్యేక ప్రయోజన వాహకం (ఎస్‌పీవీ) కోసం కొంత మేర నిధులు ఇస్తారు. ఇందులో భాగంగా అంతర్గత రహదారులు, విద్యుత్తు, నీరు, మురుగు శుద్ధి కేంద్రం, ఇంక్యుబేషన్ కేంద్రం, పనివాళ్లకు ముఖ్యంగా మహిళా కార్మికుల కోసం హాస్టల్ వసతి, లాగిస్టిక్స్ ఏర్పాటుచేస్తారు. మొదటి దశలో రూ. 300 కోట్లు అందిస్తే అందులో గ్రీన్‌ఫీల్డ్ పార్కు (జౌళి పార్కు స్థలంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేయని ప్రాంతానికి), బ్రౌన్‌ఫీల్డ్ పార్కు (ప్రభుత్వం ఇప్పటికే కల్పించిన సౌకర్యాలకు) నిధులను అందిస్తారు.

రెండు దశల్లో నిధులు వచ్చాక ఇక్కడ ఏర్పాటుచేసే పరిశ్రమలకు కేంద్రం ప్రత్యేక రాయితీల కింద ఒక్కో పరిశ్రమకు రూ. 10 కోట్ల నుంచి 15 కోట్ల వరకు ఇస్తుంది.

ఫ్యాషన్‌కు నిలయం

మెగా జౌళి పార్కు పూర్తిస్థాయిలో సిద్ధమయ్యాక చేను నుంచి రైతులు పత్తిని తీసుకొస్తే నూలు నుంచి మొదలుకొంటే విదేశాలకు కూడా ఎగుమతి చేసే నాణ్యమైన ఫ్యాషన్ దుస్తుల వరకు అన్నీ ఈ పరిశ్రమల్లోనే తయారు చేయొచ్చు. దక్షిణ కొరియా, కిటెక్స్ లాంటి పరిశ్రమల్లో తయారయ్యే దుస్తులు ఎంతో ఖరీదైన బ్రాండెడ్‌వి ఉంటాయి. ఇప్పటి వరకు పెద్దగా పరిశ్రమలు లేని వరంగల్‌కు మెగా జౌళి పార్కు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యాక దేశంలోనే అతిపెద్ద వస్త్ర పరిశ్రమలకు నిలయంగా మారనుంది.

# బకాయిలు అందక.. కొత్త మెనూ అమలవ్వక

మెట్‌పల్లి : సర్కారు బడుల్లో ఎక్కువగా పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుతుండడంతో తరచూ పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. దీన్ని అధిగమించేందుకు ప్రభుత్వం విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని నిర్ణయించింది. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే కొత్త మెనూ అమలు చేయాలని ఆదేశాలిచ్చినా చాలా పాఠశాలల్లో అమలు కావడం లేదు. పైగా నెలనెలా మధ్యాహ్న భోజన బకాయిలు చెల్లించకపోవడంతో ఏజన్సీ నిర్వాహకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలకనుగుణంగా ఛార్జీలు పెంచడంలేదని నిర్వాహకులు పేర్కొంటున్నారు. జిల్లాలో 789 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలవుతోంది. ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు సుమారు 25,497 మంది విద్యార్థులు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6 నుంచి 8వ తరగతి వరకు 6,448, ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి పదో తరగతి వరకు సుమారు 25,387 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తింటున్నారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజనం ఏజన్సీ నిర్వాహకులకు 1–5వ తరగతి వరకు రూ. 5.45, 6–8వ తరగతి వరకు రూ. 8.17, 9–10వ తరగతి వరకు రూ. 10.67 అందిస్తోంది. ఒక్కో కోడిగుడ్డుకు రూ. 5తో పాటు గౌరవ వేతనం చెల్లిస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ సంవత్సరం నూతన మెనూ తెరపైకి తీసుకువచ్చారు. ఇప్పటికే వారానికి మూడుసార్లు కోడిగుడ్డు అందిస్తుండగా, మధ్యాహ్న భోజనంలో కిచిడీ, వెజ్‌బిర్యానీని వారంలో ఒకరోజు తప్పనిసరి చేశారు. ఆదేశాలు బాగానే ఉన్నా ఆచరణకు మాత్ర నోచుకోవడం లేదు. ప్రభుత్వం బిల్లుల విడుదలలో జాప్యం ప్రదర్శిస్తుండడంతో నిర్వాహకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బిల్లుల బకాయిలు ఉండటంతో తమకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు.

రాగిజావ అమలేదీ?

వయసుకు తగ్గ బరువు, ఎత్తు ఉండని విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఈ లోపాన్ని అధిగమించేందుకు కొత్త మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారంగా రాగిజావ అందించాలని నిర్ణయించారు. విద్యార్థులకు రాగి జావ అందిస్తే వారి ఎదుగుదలకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా అందుతాయన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కానీ పాఠశాలల్లో అమలుకు నోచుకోవడం లేదు. రాగి జావ అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బిల్లులు సకాలంలో చెల్లిస్తేనే..

మధ్యాహ్న భోజనంపై కూరగాయలు, నిత్యావసర సరకుల ధరలు ప్రభావం చూపుతున్నాయి. ఇప్పటికే నిర్వాహకులకు కూరగాయల బిల్లులు, గౌరవ వేతనం బకాయిలు సకాలంలో రాక ఆర్థిక భారంతో సతమతమవుతున్నారు. ఇటీవల ఛార్జీలు స్వల్పంగా పెంచినా అవి ఏమాత్రం సరిపోవని నిర్వాహకులు పేర్కొంటున్నారు. కొత్త మెనూ ప్రకారం వెజ్‌బిర్యానీ, కిచిడీ, మిక్స్‌డ్ వెజిటబుల్ అందించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నిత్యావసర సరకుల ధరలకనుగుణంగా ఛార్జీలు పెంచడంతో పాటు గౌరవ వేతనం, బిల్లులు ఎప్పటికపుడు సకాలంలో అందించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

# ఆర్వోబీ చుట్టూ రాజకీయ రగడ

కరీంనగర్ : ఎన్నికల ముందు అసలైన ఆటను నేతలు మొదలు పెట్టారు. అభివృద్ధి పరంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధుల వాటా విషయంలో రాజకీయ రగడకు తెరతీశారు. కరీంనగర్‌లో గురువారం భూమిపూజ చేయనున్న ఆర్వోబీ (రోడ్డు ఓవర్ బ్రిడ్జి) విషయంలో సై అంటే సై అనే పంథా చూపిస్తున్నారు. నిధులు తామే తెచ్చామని భారాస, భాజపా నాయకులు పోటాపోటీగా మాటల యుద్ధాన్ని కొనసాగించారు. కొన్ని నెలల కిందే నిధులు మంజూరవగా.. ఇటీవలే పనుల టెండర్ల ప్రక్రియ పూర్తయింది. దీంతో అక్కడ భూమి పూజ చేసేందుకు మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ముహూర్తాన్ని ఖరారు చేశారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందనే సమాచారాన్ని పలు శాఖల అధికారులకు, ప్రజాప్రతినిధులకు అందించారు.

రూ. 154.74కోట్లతో..

కరీంనగర్ నుంచి చొప్పదండి వెళ్లే మార్గంలో రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉన్న ట్రాక్ వద్ద ఈ ఆర్వోబీని నిర్మించనున్నారు. సేతుబంధన్ ప్రాజెక్ట్ కింద 2022 నవంబరులో రూ. 154.74 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవే కార్యాలయం ఉత్తర్వులను వెలువర్చింది. ఆర్వోబీ నిర్మాణ వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వం 80 శాతం వాటాగా రూ. 126.74 కోట్లను భరించనుందని, మిగతా 20 శాతం వాటా రూ. 28 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం భరించాలని ఆదేశాలిచ్చింది. దీంతో ఈ ఏడాది జూన్ 12న ఈ వంతెనకు సంబంధించిన టెండర్లను ర.భ.శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. హైదరాబాద్‌లోని కమిషనరేట్ ఆఫ్ టెండర్స్ (సీవోటీ)లో జరిగిన ఈ వ్యవహారంపై స్థానిక ఎంపీనైన తనకు కనీస సమాచారం ఇవ్వలేదని బండి సంజయ్ ర.భ.శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు అప్పట్లో చర్చ జరిగింది. నాలుగు వరుసల వంతెనను దాదాపుగా 48 అడుగుల వెడల్పుతో నిర్మించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం దాదాపుగా 4 ఎకరాలు సేకరించనుండగా మిగతా 5 గుంటల భూమిని రైల్వేశాఖ అధికారులు అప్పగిస్తున్నారు.

ఆది నుంచి వివాదమే..

నాలుగేళ్ల నుంచి ఈ వంతెన ఆవశ్యకత, నిధుల మంజూరు విషయంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల భాగస్వామ్యంపై వివాదాలే కనిపించాయి. గతంలో ఎంపీగా వినోద్‌కుమార్ చొరవతోనే ఇది మంజూరైందని భారాస నాయకులు వాదనను వినిపించారు. 2019లో ఎంపీగా గెలిచిన బండి సంజయ్ పలుమార్లు కేంద్ర మంత్రులను కలిసి విన్నవించడంతోనే నిధుల మూట జిల్లాకు చేరిందని భాజపా నాయకులు ప్రకటించారు. ఈ వంతెన కోసం 2021లోనే రూ. 101 కోట్లు మంజూరవగా.. రాష్ట్ర ప్రభుత్వం వాటా విషయంలో నిర్లక్ష్యాన్ని చూపిందనే విమర్శల్ని బండి సంజయ్ బలంగా వినిపించారు. దీంతో ఎక్కువ మొత్తం కేంద్రం భాగస్వామ్యం ఉండేలా సేతుబంధన్ కింద 80 శాతం నిధుల్ని మంజూరు చేయించామన్నారు. ఈ సమయంలోనే ఇరు పార్టీల నాయకులు తమదే ఈ అభివృద్ధి ఘనత అంటూ పోటాపోటీగా క్షీరాభిషేకాల జోరుని చూపించారు. ఎంపీ సంజయ్‌కుమార్ ఇటీవలే కేంద్ర రైల్వే మంత్రిని కలిసి ఇక్కడి భూమి పూజకు రావాలనే ప్రతిపాదనను ఆయన ముందుంచినట్లు తెలిసింది. తేదీ ఖరారైతే అట్టహాసంగా ఇక్కడ శిలాఫలకాన్ని వేయాలని భావించారు. ఇంతలోనే ముహూర్తాన్ని ఖరారు చేయడాన్ని బండి సంజయ్ తప్పుబట్టారు. అందుబాటులో లేనని పిలుపు

బండి సంజయ్ కుమార్, ఎంపీ, కరీంనగర్

నేను వారణాసి పర్యటనలో ఉన్నానని తెలిసీ ప్రారంభోత్సవానికి కొన్ని గంటల ముందు కలెక్టర్ ఫోన్ చేసి ఆహ్వానించారు. ఇది సరైన పద్ధతి కాదు. ఈ వంతెనకు నిధుల్ని నేనే సాధించాను. గతంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా ఇవ్వక చేతులెత్తేయడంతో మొత్తం నిర్మాణ వ్యయమంతా భరించేలా కేంద్రాన్ని ఒప్పించాను. సేతుబంధన్ ప్రాజెక్ట్ కింద నిధులను మంజూరు చేయించాను. భూసేకరణ సహా ఇతర సర్వేలకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలి కానీ.. ఇదంతా తమ ఘనతే అనేలా భారాస నాయకులు ప్రచారానికి ప్రాధాన్యమిస్తున్నారు.

యుద్ధప్రాతిపదికన పనులైతే మేలు

బి. వినోద్‌కుమార్, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

నేను ఎంపీగా ఉన్నప్పటి నుంచి ఈ వంతెన నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం వినతులు అందించాను. రైల్వే నిబంధనల ప్రకారం ఇక్కడ రైళ్ల రాకపోకలు అంతగా ఉండవని ఆర్వోబీ ఏర్పాటుకు గతంలో అనుమతించలేదు. దీంతో ఈ ట్రాక్ ఉన్న ప్రాంతాన్ని కార్పొరేషన్‌లో విలీనం చేసి మళ్లీ ప్రయత్నాలు ప్రారంభించాం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పలు ఆర్వోబీల కోసం అందించిన వినతుల ఆధారంగానే ఈ తీగలగుట్టపల్లికి మోక్షం లభించింది. పనులు వేగంగా జరిగితే ప్రయాణికుల అవస్థలు తీరుతాయి.

# అపెరల్ ఉత్పత్తులతో కొత్త అధ్యాయం

సిరిసిల్ల : అది పాలిటెక్నిక్ కళాశాల కాదు. ఐటీఐ అంతకన్నా కాదు. కానీ అక్కడ ఆరేళ్లుగా ఉపాధి అవకాశాల కోసం శిక్షణ తీసుకుంటున్నారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లి టెక్స్‌టైల్ పార్కులో 2017 జూన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో రూ.వెయ్యి ఉపకార వేతనంతో జిల్లాలోని మహిళలకు జూకీ యంత్రంపై శిక్షణనిస్తున్నారు. దీనికి సమాంతరంగా కేంద్ర ప్రభుత్వం 2018లో సమర్థ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ రెండింటిలో కలిపి ఇప్పటికే 2,937 మంది మహిళలు శిక్షణ పూర్తిచేసుకున్నారు. వీరిలో 500 మంది ఇప్పటికే పెద్దూరులోని అపరెల్ పార్కులోని గ్రీన్‌నిడిల్ కంపెనీలో పని చేస్తున్నారు. మిగతా వారు రెండు నెలల్లో ప్రారంభం కాబోయే రెండో యూనిట్ టెక్స్‌పోర్టులో ఉపాధి అవకాశాల కోసం వేచిచూస్తున్నారు. ఇటీవలే గ్రీన్‌నిడిల్ సంస్థ తమ ఉత్పత్తులను సిరిసిల్ల నుంచి నేరుగా అమెరికాకు ఎగుమతి చేసింది. ఒకప్పుడు ముతక రకం వస్త్రోత్పత్తులకు పరిమితమైన సిరిసిల్ల, నేడు దుస్తుల తయారీ పరిశ్రమలతో కొత్త అధ్యాయానికి తెరతీసింది.

జిల్లా వస్త్ర పరిశ్రమలో ఉత్పత్తులే తప్ప మార్కెటింగ్ అంటే తెలియదు. ఇక్కడి వస్త్ర పరిశ్రమకు వెన్నుదున్నుగా నిలిచేలా 2017లో అపరెల్ పార్కు ఏర్పాటుకు ముఖ్యమంత్రి కేసీఆర్ భూమిపూజ చేశారు. అందులో ఏర్పాటు చేసిన తొలి పరిశ్రమలో తయారైన దుస్తులు అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. ప్రపంచ శ్రేణి వస్త్రోత్పత్తుల కంపెనీలు ఇక్కడికి ఆర్డర్లు ఇస్తున్నాయి. దీనిలో రెండో యూనిట్ బెంగళూరుకు చెందిన జౌళి పారిశ్రామిక సంస్థ టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్ (టీఐపీఎల్) 2022 ఫిబ్రవరి 26న రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. వాస్తవానికి జూన్‌లోనే పనులు పూర్తికావాల్సి ఉంది. ఆగస్టులో పనులు పూర్తి చేసి ప్రారంభించేందుకు పనులు వడివడిగా సాగుతున్నాయి. ప్లగ్ అండ్ ప్లేలో వసతులు

అపరెల్ పార్కు కోసం పెద్దూరులో 64 ఎకరాలు కేటాయించారు. అందులో తొలి పరిశ్రమ గ్రీన్‌నిడిల్‌కు 6,700 చదరపు గజాల విస్తీర్ణంలో రూ. 16 కోట్లతో తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీఎస్ఐఐసీ) ప్లగ్ అండ్ ప్లే పద్ధతిలో వసతులు కల్పించి ఇచ్చింది. రెండో యూనిట్ టెక్స్‌పోర్టుకు 7.2 ఎకరాలు కేటాయించారు. ఇందులో నాలుగు ఎకరాలు పరిశ్రమకు, మిగతా మూడెకరాలు పరిపాలన, క్యాంటీన్, చిన్నపిల్లల వసతి, రహదారులు, పచ్చదనం పెంచేందుకు కేటాయించారు. దీని నిర్మాణానికి ప్రభుత్వం రూ. 64 కోట్లు కేటాయించింది. రూ. 60 కోట్ల పెట్టుబడి వ్యయంతో ప్రారంభిస్తే ఈ కంపెనీలో టీషర్టులు, షార్టులు, లోదుస్తులను తయారు చేస్తారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు రెండు వేల మందికి ఉపాధి లభిస్తుంది.




అమరావతి: కోడికత్తి కేసులో నిందితుడిగా ఉన్న జనిపల్లి శ్రీనివాస్‌కు బెయిల్ లభించింది. అతడికి హైకోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. రూ.25వేల పూచీకత్తుతో రెండు ష్యూరిటీలు సమర్పించాలని.. ప్రతి ఆదివారం ముమ్మిడివరం పీఎస్‌లో హాజరుకావాలని స్పష్టం చేసింది. కేసు గురించి మీడియాతో మాట్లాడవద్దని శ్రీనివాస్‌ను ఆదేశించింది. 2018 అక్టోబర్ 25న విశాఖ విమానాశ్రయంలో అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్‌పై దాడి కేసులో శ్రీనివాస్‌ను పోలీసుల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ నిందితుడు ఎన్ఐఏ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. న్యాయస్థానం నిరాకరించడంతో హైకోర్టును ఆశ్రయించాడు. దీనిపై కొద్దిరోజుల క్రితం ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. జగన్ కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పకుండా విచారణ ప్రక్రియ ఆలస్యం అయ్యేలా చేస్తున్నారని.. దీంతో నిందితుడు జైల్లోనే మగ్గుతున్నాడని పిటిషనర్ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తెచ్చారు. హత్యాయత్నం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ఇంతకాలం జైల్లో ఉండటం సరికాదని కోర్టుకు వివరించారు. వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం.. ఇటీవల తీర్పును రిజర్వు చేసింది. తాజాగా శ్రీనివాస్‌కు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.




అమరావతి: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విజయవాడ చేరుకున్న ఆశా వర్కర్ల పట్ల జగన్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి విజయవాడ, మంగళగిరి తదితర ప్రాంతాలకు చేరుకున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. దౌర్జన్యంగా రోడ్లపై ఈడ్చుకుంటూ వాహనాల్లో పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. పలువురు ఆశా వర్కర్లకు గాయాలయ్యాయి. వడ్డేశ్వరంలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సుమారు 100 మందిని పోలీసులు నిర్బంధించారు. కాజా టోల్‌గేట్ వద్ద 15 మంది అరెస్ట్ చేశారు. పోలీసుల వైఖరిని ఆశావర్కర్లతో పాటు సీఐటీయూ నేతలు తీవ్రంగా ఖండించారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కనీస వేతనం అమలు, పనిభారం తగ్గింపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర అంశాలపై వారు గతకొంతకాలంగా ఆందోళన కొనసాగిస్తున్నారు.

**ఉద్రిక్తతకు దారి తీసిన నిరుద్యోగుల 'చలో అసెంబ్లీ'..** మరోవైపు మెగా డీఎస్సీ ప్రకటించాలంటూ నిరుద్యోగులు చేపట్టిన 'చలో అసెంబ్లీ' ఉద్రిక్తతకు దారి తీసింది. విజయవాడలో విద్యార్థి సంఘాల నేతలను పోలీసులు అరెస్టు చేశారు. నిర్బంధాలతో తమ పోరాటాన్ని ఆపలేరని నిరుద్యోగులు మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఇంటికి సాగనంపుతామన్నారు.




## మన్మోహన్‌జీ చక్రాల కుర్చీలోనూ పనిచేశారు.. మాజీ ప్రధానిపై మోదీ ప్రశంసలు

దిల్లీ: రాజ్యసభలో 56 మంది ఎంపీలు త్వరలో పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం వారికి సభలో వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడుతూ మాజీ ప్రధాని, కాంగ్రెస్ నేత మన్మోహన్ సింగ్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. ఆయన ఎంపీలందరికీ ఆదర్శమని కొనియాడారు. "ఈ దేశానికి మన్మోహన్‌జీ చేసిన సేవ అపారం. సుదీర్ఘకాలం పాటు రాజ్యసభకు ఆయన అందించిన సహకారం, దేశాన్ని నడిపించిన తీరు ఎప్పటికీ గుర్తుంటుంది.

రాజ్యసభలో ఇటీవల ఓ బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో ట్రెజరీ బెంచ్ గెలుస్తుందని తెలిసినప్పటికీ ఆయన వీల్‌చైర్‌లో వచ్చి ఓటు వేశారు. ఓ సభ్యుడిగా తన విధుల విషయంలో ఎంత బాధ్యతగా ఉన్నారనడానికి ఇదొక ఉదాహరణ. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు ఆయన చక్రాల కుర్చీలో ఉన్నా పనిచేశారు. ఎంపీలందరికీ ఆయన ఆదర్శం" అని మోదీ ప్రశంసించారు.

**వారి బ్లాక్ పేపర్.. మాకు దిష్టిచుక్క.** ఈ సందర్భంగా కేంద్రానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ విడుదల చేసిన 'బ్లాక్ పేపర్' గురించి మోదీ ప్రస్తావించారు. "ఆ పత్రం మా ప్రభుత్వానికి దిష్టి చుక్క లాంటిదే. మాపై చెడు చూపు పడకుండా చేస్తుంది. ప్రతిపక్షాల చర్యను మేం స్వాగతిస్తున్నాం" అని అన్నారు. తన పదేళ్ల పాలనపై కేంద్రంలోని అధికార భాజపా గురువారం 'వైట్‌పేపర్'ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. దీనికి కౌంటర్‌గా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే 'బ్లాక్ పేపర్'ను విడుదల చేశారు. నిరుద్యోగం, ధరల కట్టడి, రైతుల సమస్యలను తీర్చడంలో కేంద్రం విఫలమైందని హస్తం పార్టీ ఈ పత్రంలో ఆరోపించింది.

## 'యాత్ర-2' కోసం అసెంబ్లీని వాయిదా వేశారు: అచ్చెన్నాయుడు



అమరావతి: శాసనసభను వైకాపా ప్రభుత్వం అపహాస్యం చేసిందని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. ఏ చట్టం తీసుకొచ్చినా అది రాష్ట్ర వినాశనానికే దారి తీసింది తప్పితే.. సామాన్య ప్రజానీకానికి ఉపయోగపడలేదన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ప్రజా వ్యతిరేక చట్టాల జీవోలను దహనం చేసినట్లు తెలిపారు. "నేడు శాసనసభ సమావేశాల చిట్టచివరి రోజు. సభను ప్రభుత్వం అపహాస్యం చేసింది. ఉదయం 9 గంటలకు సమావేశాలు ప్రారంభమవుతాయని చెప్పారు. కోరం లేకపోవడంతో సభను 9.15కి వాయిదా వేశారు. 2 గంటలైనా మళ్లీ సమావేశపరచలేదు. యాత్ర-2 సినిమా విడుదలవుతోందని అసెంబ్లీని వాయిదా వేశారు. అందుకే మేం నిరసన వ్యక్తం చేస్తూ బయటకు వచ్చాం" అని అన్నారు. తెదేపా ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. రాష్ట్ర శాసనసభ చరిత్రలో ఈ ఐదేళ్లు చీకటిరోజులన్నారు. వాకౌట్ చేస్తున్నామని చెప్పేందుకు కూడా మైక్ ఇవ్వని విధంగా ప్రతిపక్షాల గొంతు నొక్కారని ఆరోపించారు. మహిళల గౌరవాన్ని కించపరిచే విధంగా సభ జరిగిందన్నారు. రాష్ట్రాన్ని మరో 20 ఏళ్లు వెనక్కి నెట్టేలా చీకటి జీవోలను తీసుకొచ్చారని విమర్శించారు. ఆయా జీవోల వివరాలను ఆయన వెల్లడించారు.

## వైకాపా ఫేక్ పోస్టులను వదిలిపెట్టం: అచ్చెన్న

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు వైకాపా ప్రభుత్వం రూపంలో పట్టిన శని, దరిద్రం నేటితో వదిలిపోతోందని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. గత ఐదేళ్లుగా చేసిన ప్రతి చట్టమూ రాష్ట్ర వినాశనం కోసమేనని దుయ్యబట్టారు. నిరుద్యోగ సమస్య, మహిళల భద్రతపై తెలుగుదేశం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సచివాలయం అగ్నిమాపక కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. 'ఉపాధి లేక నిరుద్యోగుల ఆకలి కేకలు.. రక్షణ లేక మహిళల ఆర్తనాదాలు' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. జాబ్ క్యాలెండర్ హామీ ఏమైందని నిలదీశారు. ఏపీలోనే అత్యధిక నిరుద్యోగిత రేటు ఉందన్నారు. అనంతరం వారంతా అసెంబ్లీకి కాలినడకన బయలుదేరి వెళ్లారు. రాష్ట్రంలో నిరుద్యోగం, మహిళల భద్రత ప్రధాన సమస్యలుగా ఉన్నాయని అచ్చెన్న పేర్కొన్నారు. 27 వేల ఖాళీలతో మెగా డీఎస్సీ ఇస్తామని యువతను మోసగించారని మండిపడ్డారు. కౌరవ సభను మళ్లీ గౌరవ సభగా మారుస్తామని చెప్పారు. శాసనసభను సైతం 5 ఏళ్లుగా వైకాపా కార్యాలయంలా నడిపారని విమర్శించారు.

**తెదేపాకు ఆ అవసరం లేదు..** భాజపా కాళ్లపై పడటం, మొక్కడం వైకాపా సంస్కృతే అని.. తెలుగుదేశానికి ఆ అవసరం లేదని అచ్చెన్నాయుడు అన్నారు. అనేక కేసుల్లో ఏ1 ముద్దాయిగా జగనే అలా చేస్తారంటూ దుయ్యబట్టారు. వైకాపా ఫేక్ పోస్టులను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పిలుపు మేరకే తమ అధినేత చంద్రబాబు దిల్లీ వెళ్లారని తెలిపారు. అక్కడి పరిణామాలపై అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటారన్నారు. ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా.. అది రాష్ట్ర ప్రయోజనాల కోసమేనని చెప్పారు.

## ఇది మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ: వైఎస్ షర్మిల



తెనాలి: ప్రజల పొలాలు, స్థలాలను వైకాపా ప్రభుత్వం కబ్జా చేస్తోందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. ఇలాంటి పాలన అవసరమో లేదో ప్రజలు ఆలోచించాలన్నారు. గుంటూరు జిల్లా తెనాలి మండలం కొలకలూరులో ఆమె పర్యటించారు. "సంక్షేమం పేరిట ఒక చేత్తో మట్టిచెంబు ఇచ్చి.. ఇంకో చేత్తో వెండి చెంబు తీసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో మద్యం వల్ల చనిపోయే వారు ఎక్కువ. ఏటా జాబ్ క్యాలెండర్ అన్నారు.. మాట తప్పారు.

మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ.. ఇది ఎన్నికల స్టంట్ మాత్రమే. ఉద్యోగాలు లేక యువత రాష్ట్రం వదిలిపోతున్నారు. పేదలకు 25 లక్షల ఇళ్లు కట్టిస్తానన్న జగన్.. ఒక్క ఇల్లు అయినా కట్టారా? రానున్న ఎన్నికల్లో రాష్ట్రం, మీ బిడ్డల భవిష్యత్తు గురించి ఆలోచించి ఓటెయ్యండి. చెత్త ఆలోచన ఉన్న ప్రభుత్వం పోతేనే రాష్ట్రం బాగుపడుతుంది. ఏపీకి కాంగ్రెస్ మాత్రమే ప్రత్యేక హోదా ఇస్తుంది. రాహుల్‌గాంధీ మొదటి సంతకం దానిపైనే" అని షర్మిల చెప్పారు.ఇది

## రాజ్యసభ పోటీలో ముగ్గురు అభ్యర్థులు వీరే..



అమరావతి: వైఎస్సార్‌సీపీ ముగ్గురు రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించింది. రాజ్యసభ బరిలో వైవీ సుబ్బారెడ్డి, గొల్లా బాబురావు, మేడా రఘునాథ రెడ్డి పేర్లను ఖరారు చేశారు. కాగా, రాజ్యసభ బరిలో నిలిచే ముగ్గురు అభ్యర్థుల పేర్లను వైఎస్సార్‌సీపీ తాజాగా ప్రకటించింది. వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మేడా రఘునాథ రెడ్డి ఎన్నికల్లో పోటీలో ఉండనున్నారు. ఇక, నేటి నుంచి ఈనెల 15వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరించనున్నారు. ఏపీలో మూడు రాజ్యసభ స్థానాలకు 27న పోలింగ్ జరుగనుంది. అనంతరం, అసెంబ్లీలో ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం జగన్‌ను కలిసి గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి, వైవీ సుబ్బారెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముగ్గురు రాజ్యసభ అభ్యర్థులను ముఖ్యమంత్రి అభినందించారు. మేడా రఘునాథరెడ్డి నందలూరు మండలం చెన్నయ్యగారి పల్లెకు చెందినవారు. మాజీ టీటీడీ బోర్డు మెంబర్ మేడా రామకృష్ణారెడ్డికి ముగ్గురు కుమారులలో రెండవ కుమారుడు మేడా రఘునాథరెడ్డి. మొదటి కుమారుడు సిట్టింగ్ రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి. మేడా రఘునాథరెడ్డి అదే మండలంలోని టంగుటూరులో విద్యాభ్యాసం పూర్తిచేశారు. డిగ్రీ పూర్తైన వెంటనే 20 ఏళ్ల వయస్సు లోనే బెంగుళూరు కేంద్రంగా నిర్మాణ రంగంలోకి ప్రవేశించారు. 2006లో MRKR కన్స్ట్రక్షన్స్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం వ్యాపార రంగంలోనే కొనసాగుతున్నారు.




దిల్లీ: కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ దేశ రాజధాని దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళనకు దిగారు. కేంద్రం నుంచి అందే నిధుల విషయంలో తమకు అన్యాయం జరుగుతోందంటూ ఆరోపించారు. ఆయనతో పాటు పార్టీ నేతలు ఇందులో పాల్గొన్నారు. వారంతా కేరళ హౌస్ నుంచి జంతర్‌మంతర్ వరకు ర్యాలీగా వచ్చారు. దిల్లీ, పంజాబ్ సీఎంలు అరవింద్ కేజ్రీవాల్, భగవంత్ మన్ కూడా నిరసన వేదిక వద్దకు వచ్చి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. మరోపక్క కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఇందులో పాల్గొనేందుకు నిరాకరించగా.. కన్నడ నేతలు, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ మద్దతు తెలిపారు. బుధవారం కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ నేతృత్వంలో ఆందోళన జరగ్గా.. తాజాగా కేరళ సీఎం కూడా అదే బాటపట్టడం గమనార్హం. నిన్న నిరసనలో పాల్గొన్న కర్ణాటక సీఎం సిద్ధూ కేంద్రంపై విమర్శలు చేశారు. దేశంలోనే అత్యధిక పన్నులు కేంద్రానికి చెల్లించే రాష్ట్రాల్లో రెండోదైన కర్ణాటక సుమారు రూ.1.88 లక్షల కోట్లు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సులను అమలు చేయకపోవడమే దీనికి కారణమన్నారు. 1972లో నాటి కేంద్ర సర్కారు ఇచ్చిన జనాభా నియంత్రణ పిలుపును అందిపుచ్చుకున్న దక్షిణ భారత రాష్ట్రాలు జనసంఖ్యను నియంత్రించాయన్నారు. నేడు అదే తమకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ఈ విమర్శలను ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్ తోసిపుచ్చారు. ఈ ఆరోపణలు దేశ విభజనకు బీజాలు నాటేలా ఉన్నాయని వ్యాఖ్యానించారు.

## జనసేన నేత నాగబాబు కీలక వ్యాఖ్యలు



విశాఖ: జనసేన పార్టీ నేత నాగబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. వైసీపీ విడుదల చేస్తున్న జాబితాపై స్పందించిన ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ ఏడో జాబితా కాదు... లక్ష జాబితాలు విడుదల చేసినా తమకు నష్టం లేదని, జనసేన ఎన్ని అసెంబ్లీ , పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేయాలో తమ అధినేత పవన్ కళ్యాణ్ నిర్ణయిస్తారని అన్నారు. పార్టీలో ఏమైనా చిన్న చిన్న సమస్యలు ఉంటే...పరిష్కరించుకొని ముందుకు వెళ్తామన్నారు. టీడీపీ, జనసేన కూటమితో బీజేపీ కలిసి వస్తుందని భావిస్తున్నామన్నారు. మరో పది రోజుల్లో జనసేన పోటీ చేసే అభ్యర్థులను తమ అధినేత పవన్ ప్రకటిస్తారని స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన మధ్య పొత్తు ఉంది కాబట్టి..టీడీపీ నేత చింతకాయల విజయ్‌తో మర్యాద పూర్వకంగానే కలిశామని చెప్పారు. అనకాపల్లి ఎంపీ పోటీ అంశం చర్చకు రాలేదని, తాను ఎక్కడ నుంచి పోటీ చేయాలో మా పార్టీ అధిష్టానం నిర్ణయిస్తుందని నాగబాబు స్పష్టం చేశారు.




అమరావతి: తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఈ నెల 11 నుంచి శంఖారావం పేరిట ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నారు.

ఈ మేరకు 'శంఖారావం'పై రూపొందించిన ప్రత్యేక వీడియోను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విడుదల చేశారు. ఉత్తరాంధ్ర నుంచి 'శంఖారావం' ప్రారంభం కానుందని, యువగళం పాదయాత్ర జరగని ప్రాంతాల్లో పర్యటించేలా ప్రణాళికలు ఉంటాయన్నారు. "ప్రజలు, పార్టీ శ్రేణుల్లో చైతన్యం నింపడమే 'శంఖారావం' లక్ష్యం. రోజూ 3 నియోజకవర్గాల్లో పర్యటన ఉంటుంది. సుమారు 50 రోజుల పాటు కొనసాగుతుంది. ఇచ్ఛాపురంలో ఈ నెల 11న తొలిసభ నిర్వహిస్తాం. జగన్ పాలనలో మోసపోయిన వారికి భరోసా కల్పిస్తాం" అని అచ్చెన్న తెలిపారు.

## మరోసారి స్టన్ అయ్యేలా తల్లికూతుళ్ళ గ్లామర్ డోస్

సోషల్ మీడియాను హీటెక్కించడంలో ముందు వరుసలో ఉంటున్నారు తల్లీకూతుళ్లు సురేఖావాణి, సుప్రిత. రెగ్యులర్ గా తమ అప్డేట్స్ ఇవ్వడమే కాకుండా మతి పోగొట్టే పిక్స్ షేర్ చేస్తూ ఫాలోయింగ్ పెంచుకుంటున్నారు. ఎప్పుడూ కొత్తగా ఆలోచిస్తూ నెటిజన్లను తమదైన కోణంలో అలరించడమే లక్ష్యంగా పెట్టుకున్న సురేఖావాణి, సుప్రిత అప్పుడప్పుడూ ఊహించని పిక్స్ ను షేర్ చేస్తుంటారు. తాజాగా ఓ నైట్ పార్టీలో కనిపించి సుప్రిత తన తల్లితో ఎంజాయ్ చేసిన మూమెంట్స్ పంచుకుంది సుప్రిత. ఓ హోటల్ బయట కెమెరా ముందు గ్లామర్ కిక్కిస్తూ ఫొటోలకు తల్లీకూతుళ్లు పోజులిచ్చారు. ఈ పిక్స్ లో సూపర్ గా కనిపించి అట్రాక్ట్ చేస్తున్నారు. బ్లాక్ కలర్ డ్రెస్సుల్లో అందాలను ఆరబోశారు. కుర్రకారును ఫిదా చేశారు. ప్రస్తుతం ఈ పిక్స్ నెట్టింట తెగ చెక్కర్లు కొడుతున్నాయి. సురేఖా వాణి, సుప్రితలు చేసుకునే వీకెండ్ పార్టీల గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. స్నేహితులతో కలిసి ఎప్పటికప్పుడూ చిల్ అవుతూనే ఉంటారు. టైమ్



దొరికితే చాలు ఇద్దరు కూడా టైమ్ ను సృలబ్రెట్ చేసుకుంటూ పాజిటివ్ వైబ్రేషన్స్ క్రియేట్ చేస్తూ వుంటారు. తమ గ్లామర్ డోస్ యాడ్ చేసి రచ్చ రచ్చ చేస్తుంటారు. ఏ మాత్రం అవకాశం దొరికినా తన తల్లి సురేఖా వాణితో కలిసి టూర్స్ వేస్తూ చిల్ అవుతూ ఉంటుంది సుప్రిత. బీచ్ లొకేషన్స్ చుట్టేయడంతో పాటు పార్టీలు, పబ్బుల్లో చిల్ అవుతూ ఉంటుంది. పొట్టి పొట్టి దుస్తులతో యువతను ఎట్రాక్ట్ చేస్తుంది. అయితే ఇలాంటి ఫొటోలతో సుప్రిత ఎన్నోసార్లు ట్రోల్స్ కు గురైంది. ఎంతమంది ఎలా ట్రోల్ చేసిన తన లైఫ్ తన ఛాయిస్ అన్నట్లుగా దూసుకెళ్తున్న ఈ బ్యూటీ.. ఇప్పుడు సోషల్ మీడియా కామెంట్స్ హిడెన్ చేసి తనపై జరుగుతున్న ట్రోలింగ్ కు బ్రేక్ వేసింది.

అంతకుముందు తన కూతురు సినీ ఎంట్రీ గురించి మాట్లాడిన సురేఖా వాణి.. తనకు సినీ ఎంట్రీ ఇష్టముంటే అడ్డు చెప్పనని చెప్పిన సంగతి తెలిసిందే. ఓ సెలబ్రిటీ డాటర్ గా సినిమాల్లో క్లిక్ కాకముందే బాగా పాపులర్ అయింది సుప్రిత. సోషల్ మీడియా వేదికగా హంగామా చేస్తూ భారీ రేంజ్ ఫాలోయింగ్ సంపాదించింది. దీంతో ఆమె ఫొటోస్ ఫుల్ గా వైరల్ అవుతున్నాయి.

## పడగొట్టిన ప్రతిసారీ లేచాను: నయనతార

బుల్లితెర యాంకర్ నుంచి నటిగా మారిన నయనతార అగ్ర కథానాయికగా ఎదురేలేని స్థానానికి ఎదిగారు. తలైవిగా తమిళనాట పిలుపందుకున్న ఏకైక ప్రతిభావని. అభిమానులు తమిళ సినిమా లేడీ సూపర్ స్టార్ అని పిలుస్తారు. తమిళ పరిశ్రమలోకి ప్రవేశించినప్పటి నుండి సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలోని అత్యంత ఆకర్షణీయమైన ప్రభావవంతమైన వ్యక్తులలో ఒకరిగా మారింది. అందానికి అందం ప్రతిభతో ప్రేక్షకులను థియేటర్లకు రప్పించే మ్యాజిక్ తన సొంతం. దాదాపు రెండు దశాబ్దాలుగా పురుషాధిక్య పరిశ్రమలో అసాధారణ విజయాలు సాధించింది. షోబిజ్‌లో 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నయన్ తన అభిమానులను కృతజ్ఞతా పత్రాన్ని రాసింది. ఆ నోట్‌లో విషయాలు ఇలా ఉన్నాయి. “20 ఏళ్ల తర్వాత కూడా నేను ఈ రంగంలో నిలబడటానికి కారణం మీరే. నా




కెరీర్‌కు గుండె చప్పుడు.. నా ప్రయాణానికి చోదక శక్తి.. నన్ను పడగొట్టిన ప్రతిసారీ తిరిగి లేవడానికి కారణం మీరే. మీరు లేకుండా ఈ ప్రయాణం అసంపూర్ణం. సమీపంలోని వారు లేదా దూరంగా ఉన్న నా అభిమానులందరికీ ధన్యవాదాలు.. మీరు ప్రత్యేకమైనవారు. ప్రతి ప్రాజెక్ట్‌ను కేవలం ఒక అద్భుతంగా మార్చే మ్యాజిక్ మీరు. నేను ఈ మైలురాయిని సెలబ్రేట్ చేసుకుంటున్నాను. రెండు దశాబ్దాలుగా సినిమా రంగంలో అద్భుతమైన స్ఫూర్తిదాయకమైన శక్తి మీరు” అని ఎమోషనల్ అయ్యారు నయన్. పరిశ్రమలో నయనతార ప్రయాణం ఎత్తుపల్లాలతో కూడుకున్నది. తన ప్రారంభ ప్రయాణంలో కొన్ని పరాజయాల్ని ఎదుర్కొంది. ఒకానొక సందర్భంలో 2011లో శ్రీరామరాజ్యం విడుదలైన తర్వాత వినోద పరిశ్రమను విడిచిపెట్టాలని కూడా నయనతార భావించింది. అయితే రెండు సంవత్సరాల గ్యాప్ తర్వాత ‘రాజా రాణి’ చిత్రంతో పెద్ద విజయం అందుకుని బలంగా తిరిగి వచ్చింది. ఈ కంబ్యాక్ నయన్ జీవితాన్ని శాశ్వతంగా మార్చింది. నయనతార మధ్యస్థ స్క్రిప్ట్‌లపై దృష్టి పెట్టకూడదని నిర్ణయం తీసుకుంది. ప్రత్యేకమైన ప్రాజెక్ట్‌లకు మాత్రమే సంతకాలు చేసింది. స్వతంత్రంగా సినిమాలను తన భుజస్కంధాలపై తీసుకెళ్లగల సామర్థ్యాన్ని చూపింది. మాయ, డోర, అరమ్ వంటి అనేక మహిళా సెంట్రిక్ సినిమాలతో విజయాలు అందుకుంది. తిరుగేలేని ఛరిష్మా దృష్ట్యా నయన్ ని ఫ్యాన్స్ లేడీ సూపర్ స్టార్ అని ఆరాధిస్తున్నారు. తలైవి నయనతార ఈ ఏడాది ప్రారంభంలో షారుఖ్ ఖాన్ ‘జవాన్’తో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. అట్లీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ప్రేక్షకుల నుండి సానుకూల సమీక్షలను అందుకుంది. ప్రపంచవ్యాప్తంగా 1000 కోట్ల రూపాయలకు పైగా వసూలు చేసింది. తదుపరి ‘కర్ణ’ చిత్రంలో ప్రధాన పాత్ర కోసం నయనతార పేరును పరిశీలిస్తున్నట్లు కథనాలొచ్చాయి.




## ఆ పొడుగు కాళ్ల జాతర ఆపవమ్మా



అందానికి అందం ప్రతిభ ఒకే ఒరలో ఇమిడితే అది పూజా హెగ్డే. అందుకే దశాబ్ధ కాలంగా స్టార్ హీరోయిన్ గా తన హోదాను కాపాడుకోవడంలో సఫలమైంది. జయాపజయాలతో సంబంధం లేకుండా ఇప్పటికీ ఒడిదుడుకులను తట్టుకుని నిలబడింది. ఇటీవల కొన్ని క్రేజీ అవకాశాలు తనని వదిలి వెళ్లినా కానీ, ఇప్పుడు వరుసగా అగ్ర హీరోల సరసన అవకాశాలు అందుకుంటోంది. నిజానికి పూజా హెగ్డేకు ఇది గ్రేట్ కంబ్యాక్ అని చెప్పాలి. మరోవైపు నిరంతరం తనను అనుసరిస్తున్న సోషల్ మీడియా అనుచరుల కోసం పూజా ఇస్తున్న విజువల్ ట్రీట్ మామూలుగా లేదు. తాజాగా కమల్ నాండ్ ఇన్ స్టాలో షేర్ చేసిన వీడియో ఒకటి మైండ్ బ్లాక్ చేస్తోంది. ఈ వీడియోలో చిట్టి పొట్టి ఫ్రాకులో పూజా హొయలు మతులు చెడగొడుతున్నాయి. అలా పడవలాంటి కార్ దిగి మీడియా ఎదుటకు నడుచుకుంటూ వస్తున్న పూజా పొడుగు కాళ్ల సౌందర్యం మతులు చెడగొడుతున్నాయి. అల వైకుంఠపురములో చిత్రం కోసం ఆ పొడుగు కాళ్ల సౌందర్యంపై అద్భుతమైన సాహిత్యాన్ని రాసారు సినీకవులు. ఈ చిత్రంలో పూజా పొడుగు కాళ్ల సౌందర్యానికి పడిపోయే కుర్రాడిగా బన్ని కనిపించాడు. ఇప్పుడు తాజా వీడియోలో నవ్వులు చిందిస్తూనే పొడుగు కాళ్ల సౌందర్యాన్ని పొట్టి ఫ్రాకు సొగసును ఆవిష్కరించింది పూజా. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాల్లో జోరుగా వైరల్ అవుతోంది. ఆ పొడుగు కాళ్ల జాతర ఆపవమ్మా! అంటూ కొందరు యూత్ సరదాగా వ్యాఖ్యానిస్తున్నారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. మహర్షి, మృగం, మొహెంజొదారో, అల వైకుంఠపురములో వంటి చిత్రాలతో ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకుంది పూజా హెగ్డే. చివరిగా కిసీ కా భాయ్ కిసీ కి జాన్ చిత్రంలో కనిపించింది. తదుపరి దేవా, హౌస్‌ఫుల్ 5, షీ వ్యాక్స్, AA21, ఐకాన్ , గంజా శంకర్ వంటి చిత్రాలతో అలరించనుంది. ఇవే కాకుండా అజయ్ జ్ఞానముత్తు రూపకల్పనలోని టెలివిజన్ సిరీస్ లోను నటించనుంది.

## యశ్ ‘టాక్సిక్’ కోసం కరీనా కపూర్ తో పాటూ మరో ఇద్దరూ!






కేజీఎఫ్ సిరీస్ తో పాన్ ఇండియా స్టార్ గా గుర్తింపు తెచ్చుకున్నాడు కన్నడ హీరో యశ్. గత సంవత్సరం రిలీజ్ అయిన కేజీఎఫ్ చాప్టర్ 2 ప్రపంచవ్యాప్తంగా రూ 1000 కోట్ల మార్క్ అందుకొని హీరోగా యశ్ మార్కెట్ ని మరింత పెంచింది. దీంతో తన తదుపరి ప్రాజెక్టు విషయంలో యశ్ ఎన్నో జాగ్రత్తలు వహిస్తూ ఆచితూచి అడుగులు వేశాడు. అందుకే కేజీఎఫ్ తర్వాత కొత్త సినిమాని అనౌన్స్ చేయడానికి దాదాపు ఏడాదిన్నర సమయం పట్టింది. యశ్ కొత్త సినిమా అనౌన్స్మెంట్ ఎప్పుడెప్పుడా అని ఎంతో ఆతృతగా ఎదురుచూసిన ఫ్యాన్స్ కి ఈ మధ్యే తన కొత్త సినిమాని అఫీషియల్ గా అనౌన్స్ చేస్తున్న విషయం తెలిసిందే యశ్ కెరియర్ లో 19వ ప్రాజెక్ట్ అయిన ఈ చిత్రానికి ‘టాక్సిక్ – ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్స్ అప్స్’ అనే వెరైటీ టైటిల్ ని ఫిక్స్ చేశారు. గీత మోహన్ దాస్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీకి సంబంధించి తాజాగా అప్డేట్ బయటికి వచ్చింది.

అదేంటంటే, ఈ సినిమా కోసం బాలీవుడ్ హీరోయిన్ కరీనా కపూర్ తో పాటు మరో ఇద్దరు హీరోయిన్స్ ని మూవీ టీం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అంతా అనుకున్నట్టు జరిగితే ఈ సినిమాతోనే కరీనాకపూర్ సౌత్ లోకి ఆరంగేట్రం చేసే అవకాశాలు ఉన్నాయని, యశ్ తో కలిసి చేసేందుకు కరీనా కూడా ఆసక్తిగా ఉందని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమాలో కరీనాకపూర్ తో పాటు మరో ఇద్దరు హీరోయిన్స్ కూడా ఉంటారట. యశ్ టాక్సిక్ మూవీ లో మొత్తం ముగ్గురు హీరోయిన్లు నటించబోతున్నట్లు సమాచారం. కరీనా కపూర్ కంటే ముందు సినిమాలో యశ్ కి జోడిగా సాయి పల్లవి, శృతిహాసన్ వంటి హీరోయిన్స్ నటిస్తున్నట్లు ఇప్పటికే వార్తలు తెరపైకి వచ్చాయి. గ్లోబల్ డ్రగ్ మాఫియా నేపథ్యంలో తలకెక్కనున్న ఈ సినిమాలో ఎస్ క్యారెక్టర్లేజేషన్ గ్రే షేడ్స్ ని కలిగి ఉంటుందట సినిమాలో ముగ్గురు హీరోయిన్లకు ప్రధాన పాత్రలు ఉండడంతో ఆ పాత్రల కోసం కరీనాకపూర్, శృతిహాసన్, సాయి పల్లవి లతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

త్వరలోనే మేకర్స్ నుంచి ఇందుకు సంబంధించి ఆఫీషియల్ అనౌన్స్మెంట్ వచ్చే అవకాశం ఉంది. కాగా ఈ సినిమాని శ్రీలంక, గోవా, లండన్ లాంటి ప్రాంతాల్లో చిత్రీకరించనున్నారు. వచ్చే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలకానుంది. జనవరి 8 యష్ బర్త్ డే కావడంతో ఫ్యాన్స్ ఈ సినిమా నుంచి ఏదైనా అప్డేట్ ఇస్తే బాగుంటుందని భావిస్తున్నారు.

## జాన్వీ.. దేవరను ఏ రేంజ్ లో లేపుతోందంటే..

జాన్వీ కపూర్.. హీరోయిన్ గా బాక్సాఫీస్ వద్ద పెద్దగా సక్సెస్ లేకపోయినప్పటికీ అమ్మడికి గ్లామర్ విషయంలో మాత్రం స్టార్ హీరోయిన్ గా మంచి క్రేజ్ అయితే క్రేజ్ ఉంది. ఆమె ఎలాంటి ఫోటో పోస్ట్ చేసినా కూడా సోషల్ మీడియాలో నిమిషాల్లోనే ట్రెండింగ్ లిస్టు లోకి వచ్చేస్తాయి. అందం విషయంలో అయితే ఎలాంటి విమర్శలు అందుకోకుండా అమ్మడు తన ఫ్యాన్ ఫాలోవర్స్ ను పెంచుకుంటుంది. ఇక ఈ బ్యూటీ కి అసలు ఇంతవరకు ఒక్క సక్సెస్ కూడా ఎందుకు రాలేదు అనే సందేహాలు చాలానే వస్తూ ఉంటాయి. కానీ ఇప్పుడు ఆమె సరైన ట్రాక్ లోకి వచ్చినట్లుగా చెబుతోంది. అది కూడా దేవర సినిమాను ఒకవైపు పొగిడేస్తూనే మరొకవైపు తన పాత్ర



పై కూడా అమ్మడు చాలా పాజిటివ్ గా రియాక్ట్ అయ్యింది. జాన్వి కపూర్ ఎప్పటినుంచో తెలుగులో మంచి సినిమా చేయాలని ఆలోచన ఉంది. ఇక ఇప్పుడు మొత్తానికి ఆమె దేవర సినిమాతో సరైన టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లుగా చిత్ర యూనిట్ ఇదివరకే స్పందించింది. ఇక రీసెంట్గా జాన్వికపూర్ కాఫీ విత్ కరణ్ షోలో దేవర సినిమాలోని తన పాత్ర గురించి తెలియజేసింది. పూర్తిస్థాయిలో మాట్లాడలేదు కానీ ఇంతకుముందు తన సినిమాలు తన క్యారెక్టర్లు ఒక లెక్క ఇప్పుడు చేయబోయే తంగం క్యారెక్టర్ మరొక్క లెక్క అనేలా స్పందించింది. దేవర సెట్లోకి వెళ్ళగానే ఒక మంచి క్యారెక్టర్ చేస్తున్నాను అనే భావన కలిగింది. ఇది తనకు కావలసిన అసలైన క్యారెక్టర్ అని అనిపించినట్లు.. చెబుతూ దేవర సెట్లో ఉన్నప్పుడు ఇంతకుముందు చేసిన సినిమాలన్నీ కూడా ఒక వర్క్ షాప్ లాగా అనిపించింది అని వివరణ ఇచ్చింది. ఇకనుంచి తన పాత్రల సెలక్షన్ కూడా ఇదే తరహాలో ఉంటుంది అని తెలియజేసింది. మొత్తానికి ఒక అద్భుతమైన టీ తో కెరియర్కు ఉపయోగపడే విధంగా కొత్త విషయాలు నేర్చుకుంటున్నాను అన్నట్లుగా జాన్వీ మాట్లాడింది. దీంతో ఒకవైపు ఆమె తంగం క్యారెక్టర్ ను పొగుడుతూనే మరొకవైపు దేవర సినిమాపై కూడా హైప్ క్రియేట్ చేసింది. అలాంటి బిగ్గెస్ట్ టాక్ షోలో అమ్మడు దేవర సినిమా గురించి ఈ విధంగా మాట్లాడింది అంటే ఎంతగా నమ్మకం పెట్టుకుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మరి ఈ సినిమాతో ఆమె కెరీర్ ఎలాంటి మలుపు తిరుగుతుందో చూడాలి.

## ముద్దుగుమ్మ అందాల తడాఖా..!

హీరోయిన్స్ లో చాలా అరుదుగా మాత్రమే మల్టీ ట్యాలెంట్ ఉన్న వారు ఉంటారు. వారిలో ఆండ్రియా జెర్మియా ఒకరు అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఒక వైపు హీరోగా చేస్తూనే ఆమె తన గాత్రంతో శ్రోతలను అలరించింది. అందమైన ఆండ్రియా అంతకు మించి అందమైన గాత్రం కలిగి ఉన్నారు. పేరు కాస్త విదేశీ అమ్మాయి పేరు అన్నట్లుగా ఉన్నా కూడా భారత దేశ నటి ఈమె. 2005 మలో కందా నాల్ ముదల్ అనే తమిళ సినిమా తో ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. తమిళ మరియు తెలుగు సినీ ఇండస్ట్రీలో ఈ అమ్మడు తనదైన ముద్ర వేసేందుకు ప్రయత్నించి సఫలం అయింది. తడాఖా సినిమా తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ఈ అమ్మడు ఆ



తర్వాత పెద్దగా కనిపించలేదు. పూర్తిగా తమిళంకే పరిమితం అయిన ఈ అమ్మడు అప్పుడప్పుడు డబ్బింగ్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులను పలకరిస్తూ వచ్చింది. ముద్దుగుమ్మ ఆండ్రియా తాజాగా బీచ్ లో తీసుకున్న సెల్ఫీ ని షేర్ చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. క్లీ వేజ్ షో చేస్తూ క్లో జప్ లో ఈ అమ్మడు చాలా అందంగా కనిపిస్తోందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. వయసు పెరుగుతున్న కొద్దీ ఈమె అందం పెరుగుతుందా అన్నట్టు కొందరు కామెంట్ చేస్తున్నారు.




హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ ద్వారా 2 లక్షల ఉద్యోగాల భర్తీకి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వెల్లడించారు. తెలంగాణలో శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. పెద్దఎత్తున మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులు చేపడతామని.. ఆ నది మరోసారి హైదరాబాద్ జీవనాడిగా మారుతుందని చెప్పారు.

**గత ప్రభుత్వ నిర్వాకాలను ప్రజలకు తెలిపాం :** ప్రస్తుతం తెలంగాణలో ప్రజల కోసం, ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వం ఉందన్నారు. రాష్ట్ర ఏర్పాటులో కలిసివచ్చిన పార్టీలు, వ్యక్తులతోపాటు అప్పటి మన్మోహన్ సర్కారుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. "ప్రత్యేకించి సోనియాగాంధీ పోషించిన పాత్రను ప్రభుత్వం స్మరించుకుంటోంది. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ద్వారా మహిళలు ఇప్పటివరకూ 15 కోట్ల ట్రిప్పులు ప్రయాణించారు. పాలమూరు-రంగారెడ్డి వంటి సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. ధరణి కమిటీ ద్వారా భూ సమస్యలు పరిష్కరిస్తాం. మా ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ, పారదర్శకతను పాటిస్తుంది. గత ప్రభుత్వం నిర్వాకాలను శ్వేతపత్రం ద్వారా ప్రజలకు తెలియజేశాం. రాష్ట్రంలో ప్రత్యేక నైపుణ్య వర్సిటీలు ఏర్పాటు చేస్తాం.

**12 ఫార్మా విలేజ్ క్లస్టర్లు! :** విద్యతో పాటు ఉద్యోగమూ సాధించేలా యువతలో నైపుణ్యాలు పెంపునకు కృషి చేస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళ, వికలాంగ పారిశ్రామిక వేత్తలకు తోడ్పాటు అందిస్తాం. 10 నుంచి 12 ఫార్మా విలేజ్ క్లస్టర్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. సమగ్ర డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తుంది. హైదరాబాద్‌ను దేశంలోనే కృత్రిమ మేధ (ఏఐ) ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. 50 నుంచి 100 ఎకరాల్లో ఏఐ సిటీ ఏర్పాటు చేస్తాం. రూ.2 వేల కోట్లతో ప్రభుత్వ ఐటీఐలను ఆధునిక టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తాం. క్రీడారంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా చేయడమే మా లక్ష్యం. కులగణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. బడ్జెట్ కేవలం ఆర్థిక పత్రం కాదు.. భవిష్యత్‌కు నమూనా" అని చెప్పారు.

**ఫిబ్రవరి 10న బడ్జెట్ :** గవర్నర్ ప్రసంగం అనంతరం సభ వాయిదా పడింది. తొమ్మిదో తేదీన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ జరుగుతుంది. అదే రోజు శాసనసభ కార్యకలాపాల సలహాకమిటీ (బీఏసీ) సమావేశాన్ని నిర్వహించి, సభను ఎన్ని రోజులు నడపాలనే దానిపై నిర్ణయం తీసుకుంటారు. ఆర్థిక శాఖను నిర్వహించే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఫిబ్రవరి 10న బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అనంతరం బడ్జెట్‌పై సాధారణ చర్చ జరగనుంది. బడ్జెట్ సమావేశాలు సుమారు 7-10 రోజుల వరకు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది.

## కేసీఆర్.. భారాస గురించి ప్రజలు ఆలోచించడం మానేశారు: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు సిటింగ్ జడ్జిని ఇవ్వలేమని హైకోర్టు చెప్పిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. విశ్రాంత జడ్జితో విచారణ జరిపించుకోవాలని సూచించినట్లు చెప్పారు. ఉన్నత న్యాయస్థానం చెప్పిన అంశంపై మంత్రివర్గంలో లేదా అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. మిషన్ భగీరథపైనా విచారణకు ఆదేశించామని సీఎం వెల్లడించారు. గవర్నర్ తమిళిసై ప్రసంగం పూర్తి అయిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. భారాస అధినేత కేసీఆర్ శాసనసభకు రావాలని కోరుకుంటున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. కృష్ణా జలాల విషయంలో ఆయన చిత్తశుద్ధిని ప్రజలు చూశారన్నారు. గవర్నర్ ప్రసంగానికి రాలేదంటేనే ఆయన ఎంత బాధ్యతగా ఉన్నారో అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. కేసీఆర్, భారాస గురించి ప్రజలు ఆలోచించడం మానేశారని ఎద్దేవా చేశారు. ఉద్యోగ నియామకాల విషయంలో స్పష్టతతో ఉన్నామన్నారు. విధానపరమైన లోపాలు లేకుండా పాలన సాగిస్తున్నామని సీఎం తెలిపారు. రాజ్యసభ ఎన్నికల్లో ఎంతమంది పోటీ చేసేది అధిష్ఠానం నిర్ణయిస్తుందని చెప్పారు.

## మంత్రి పదవి ఎప్పుడు..? కేటీఆర్, రాజగోపాల్‌రెడ్డి మధ్య ఆసక్తికర చర్చ





హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మధ్య అసెంబ్లీ లాబీలో ఆసక్తికర చర్చ జరిగింది. మంత్రి పదవి ఎప్పుడు వస్తుందని రాజగోపాల్‌ను కేటీఆర్ అడగ్గా.. "మీలాగే తమకూ ఫ్యామిలీ ఎఫెక్ట్ పడుతుంది" అని ఆయన జవాబిచ్చారు. "ఫ్యామిలీ పాలన కాదు.. బాగా పనిచేస్తే కీర్తిప్రతిష్ఠలు వస్తాయి. ఎంపీగా మీ కుమార్తె కీర్తి పోటీ చేస్తారా? కుమారుడు సంకీర్త్ పోటీ చేస్తారా?" అని కేటీఆర్ అడిగారు. దయచేసి తనను వివాదాల్లోకి లాగవద్దని రాజగోపాల్ కోరారు.

## నేను హోంమంత్రి అయితేనే వాళ్లు కంట్రోల్‌లో ఉంటారు: కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాల తర్వాత మంత్రివర్గ విస్తరణ ఉంటుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. శాసనసభ ప్రాంగణంలో మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తనకు అధిష్ఠానం హామీ ఇచ్చిందని.. హోంశాఖ ఇవ్వాలని కోరుతున్నానని చెప్పారు. "కేసీఆర్‌ను గద్దె దించేందుకే కాంగ్రెస్‌లోకి వచ్చా. నేను హోంమంత్రి అయితేనే భారాస నేతలు కంట్రోల్‌లో ఉంటారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావు, జగదీశ్‌రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయం. భువనగిరి, నల్గొండ లోక్‌సభ స్థానాల్లో మా కుటుంబసభ్యులెవరూ పోటీ చేయకూడదనేది మా ఆలోచన. పార్టీ ఆదేశిస్తే పోటీ చేస్తాం. ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపిస్తాం" అని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

## ఖానాపూర్‌లో దారుణం.. నడిరోడ్డుపై యువతి హత్య



ఖానాపూర్: నిర్మల్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. నడిరోడ్డుపై యువతిని కత్తితో నరికి దారుణంగా హత్య చేశాడు ఓ యువకుడు. జిల్లాలోని ఖానాపూర్ పరిధి శివాజీనగర్‌లో గురువారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఖానాపూర్ పట్టణంలోని అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన సీహెచ్ సోనీ అలియాస్ స్వీటీ (20).. టైలరింగ్ షాపు నుంచి ఇంటికి వెళ్తుండగా యువకుడు కత్తితో దాడి చేశాడు. అడ్డుకోబోయిన ఆమె వదిన, పక్కనే ఉన్న రెండేళ్ల చిన్నారిపైనా దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో యువతి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. బాలుడి తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని సీఐ మోహన్, ఎస్ఐ లింబాద్రి పరిశీలించారు. యువతిపై దాడికి ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. హత్య చేసిన తర్వాత పరారైన నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## కాంగ్రెస్‌కు మరో షాక్.. సీనియర్ నేత రాజీనామా

ముంబయి: మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీకి మరోసారి గట్టి షాక్ తగిలింది. సీనియర్ నేత బాబా సిద్ధిక్ పార్టీని వీడుతున్నట్లు గురువారం ప్రకటించారు. 48 ఏళ్లుగా పార్టీలోనే ఉన్న ఆయన ఆకస్మికంగా తన ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. "నేను యువకుడిగా ఉన్నప్పుడే కాంగ్రెస్‌లో చేరా. 48 ఏళ్ల పాటు పార్టీలోనే ఉన్నా. నేడు కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశాను. చెప్పేందుకు చాలా ఉన్నా.. కొన్ని విషయాలు చెప్పకపోవడమే మంచిది. ఇన్నేళ్లు నాకు అండగా నిలిచిన పార్టీ కార్యకర్తలు, నాయకులు, సహచరులకు ధన్యవాదాలు" అని 'ఎక్స్' (ట్విటర్) వేదికగా పేర్కొన్నారు. విద్యార్థి నాయకుడైన సిద్ధిక్ తొలుత బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌కు కార్పొరేటర్‌గా ఎన్నికై తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు.

ఆ తర్వాత బాంద్రా పశ్చిమ నియోజకవర్గం నుంచి 1999, 2004, 2009లో రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికయ్యారు. రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రిగా వ్యవహరించారు. దీంతోపాటు మహారాష్ట్ర హౌసింగ్ అండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ముంబయి విభాగానికి ఛైర్మన్‌గా కూడా పనిచేశారు. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ఇటీవల ఆయన తన కుమారుడితో సహా రాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌ను కలిశారు. త్వరలో సిద్ధిక్ ఎన్సీపీలో చేరే అవకాశం ఉన్నట్లు ఊహాగానాలు పుట్టుకొచ్చాయి. రోజుల వ్యవధిలోనే సిద్ధిక్ రాజీనామా చేయడం గమనార్హం. మహారాష్ట్రలో కాంగ్రెస్ సీనియర్ నేత మిలింద్ దేవ్‌రా కొన్నిరోజుల క్రితం తన ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. పార్టీలో శక్తిమంతమైన యువ నాయకుల్లో ఆయన ఒకరు.




ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అసెంబ్లీకి తొలి రోజు ఆర్టీసీ బస్సులో వచ్చారు. నాంపల్లిలో బస్ ఎక్కి అసెంబ్లీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఉచిత బస్ ప్రయాణంపై మహిళలతో మాట్లాడి.. వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. విద్యార్థులు, యువకులు ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకరావాలని తెలిపారు. ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని వెంకట్ స్పష్టం చేశారు.

## అవినీతి మరక ఉంటే ఆయన్ను డీజీపీగా ఎందుకు కూర్చోబెట్టారు?: కవితకు కొండా సురేఖ కౌంటర్




హైదరాబాద్: కాంగ్రెస్ పాలనపై భారాస ఎమ్మెల్సీ కవిత చేసిన విమర్శలపై మంత్రి కొండా సురేఖ కౌంటర్ ఇచ్చారు. ఆమె మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంత్రి మాట్లాడారు. "భారాస పాలనలో తెలంగాణ యువతకు న్యాయం చేయలేదు. వారి భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించారు. మా ప్రభుత్వం వచ్చి రెండు నెలలు కూడా పూర్తి కాలేదు. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన వాళ్లు ఇప్పుడు మాపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉంది. టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్‌గా మహేందర్‌రెడ్డి నియామకం జరిగి రెండు వారాలే అయింది. 36 ఏళ్లుగా ఆయన వివిధ హోదాల్లో పనిచేశారు. ఆయన ఏమైనా లిక్కర్ స్కాం చేశారా? పేపర్లు లీక్ చేశారా? అవినీతి మరకే ఉంటే మీ ప్రభుత్వంలో డీజీపీగా ఎందుకు కూర్చోబెట్టారు? సింగరేణి నిధులను సిరిసిల్ల, గజ్వేల్‌కు తరలించుకుపోయిందెవరు? నిరుద్యోగుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చే బాధ్యతను మేం తీసుకుంటాం. మాట నిలబెట్టుకుంటామనే మాపై అక్కసుతో విమర్శలు చేస్తున్నారు" అని కొండా సురేఖ అన్నారు.

## వీక్షణం పత్రిక ఎడిటర్ నివాసంలో ఎన్ఐఏ సోదాలపై వేణు ఏమన్నారంటే




హైదరాబాద్: వీక్షణం పత్రిక ఎడిటర్, వరవరరావు అల్లుడు వేణుగోపాల్ నివాసంలో గురువారం తెల్లవారుజామున ఎన్ఐఏ అధికారులు సోదాలు నిర్వహించారు. దాదాపు ఐదు గంటల పాటు తనిఖీలు చేపట్టారు. పత్రికా ప్రకటన ద్వారా పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎన్ఐఏ అధికారులు చెప్పారు. కాగా.. ఇటీవల మావోయిస్టు సెంట్రల్ కమిటీ మెంబర్ దీపక్ అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. దీపక్‌ను కూకట్‌పల్లిలో పోలీసులు అరెస్ట్ చేశారు. దీపక్ దగ్గర దొరికిన సమాచారం మేరకు వేణు నివాసంలో ఎన్ఐఏ సోదాలు చేసినట్లు తెలుస్తోంది. దీనిపై స్పందించిన వేణుగోపాల్ మీడియాతో మాట్లాడుతూ ఈరోజు తెల్లవారుజాము ఐదు గంటలకు తమ ఇంటికి ఎన్ఐఏ అధికారులు వచ్చారని.. సెర్చ్ వారెంట్ ఉందని, సంజయ్ దీపక్ రావు అరెస్ట్ అయిన దానిపై వచ్చామని చెప్పారన్నారు. 2013 నయీమ్ బెదిరింపుల లేఖ పుస్తకాలు రాసానని, ఆ పుస్తకాలను తీసుకెళ్లారని.. తన మొబైల్ సీజ్ చేశారని వేణుగోపాల్ తెలిపారు. సెప్టెంబర్ 15న సింహపురి టౌన్ షిప్‌లో సంజయ్ దీపక్ రావును అరెస్ట్ చేశారన్నారు. అయితే దీపక్‌కు తనకు సంబంధం ఉందని కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసారన్నారు. దీనిపై గత ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రికి లేఖ రాసానని, ఆ ఉత్తరం పత్రికల్లో ప్రచారం అయ్యిందన్నారు. దేశంలో ఎన్ఐఏ ఉపా చట్టం ద్వారా పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరామని, జనవరి 3న తనపై పెట్టిన కేసును ఎన్ఐఏ టేకప్ చేసుకుందని, ఈ కేసులో తనను ఏ -22 గా చేర్చారన్నారు. అలాగే పోలీసుల దగ్గర ఉన్న కన్ఫెక్షన్ స్టేట్‌మెంట్‌లో తన పేరు ప్రస్థావించినట్టు ఎఫ్ఐఆర్‌లో పెట్టారని.. ఇది పూర్తిగా అబద్ధపు కేసని చెప్పారు. తానొక మాస పత్రిక నడుపుతున్నానని, కబలి దళం మీటింగ్ పెట్టి ప్రభుత్వాన్ని కులగొట్టడానికి ప్రయత్నాలు చేసినట్టు కేసు పెట్టారని.. తాను ప్రస్తుతం విరసంలో లేనని వేణుగోపాల్ పేర్కొన్నారు.

## గవర్నర్ ప్రసంగంలో ఆరు గ్యారంటీల అమలుపై స్పష్టత లేదు: హరీశ్ రావు




హైదరాబాద్: గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రసంగంపై భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శనాస్త్రాలు సంధించారు. రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ప్రసంగం విశ్వాసం కల్పించలేకపోయిందని.. ప్రభుత్వ విజన్‌ను ఆవిష్కరించలేకపోయిందన్నారు. ప్రభుత్వ హామీలు, గ్యారంటీల అమలుపై స్పష్టత ఇవ్వలేదని పేర్కొన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. "ప్రజావాణి' ప్రభావం చూపించలేకపోయింది.

రోజూ విజ్ఞప్తులు స్వీకరిస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి.. ఒక్క రోజు మాత్రమే వెళ్లారు. ప్రస్తుతం పొరుగు సేవల సిబ్బంది మాత్రమే దరఖాస్తులు తీసుకుంటున్నారు. ఇప్పటికే రెండు గ్యారంటీలు అమలు చేశామని ప్రభుత్వం చెబుతోంది. నిజానికి వాటిని పాక్షికంగా అమలు చేశారు. గవర్నర్ ప్రసంగంలో ఆరోగ్యశ్రీ ప్రస్తావన లేదంటే దాని అమలు సరిగ్గా లేదని చెప్పకనే చెప్పారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం వాయిదా వేశారు. మరో 10.. 15 రోజుల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే హామీల అమలు ఎలా సాధ్యపడుతుంది? మిగిలిన హామీల గురించి గవర్నర్ ప్రస్తావించలేదు. ప్రభుత్వ ఆలోచనలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు" అని పేర్కొన్నారు.

## బీఏసీకి హరీష్‌రావు.. ససేమిరా అన్న మంత్రి శ్రీధర్.. ఎందుకంటే?



హైదరాబాద్: బీఏసీలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావుకు అవమానం జరిగింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ అధ్యక్షతన జరుగుతున్న బీఏసీ మీటింగ్‌కు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు బదులుగా హరీష్‌రావు హాజరయ్యారు. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బీఏసీలో మెంబర్ కాకుండా హరీష్ హాజరుకావడంపై అభ్యంతరం తెలిపారు. స్పీకర్ అనుమతితో కేసీఆర్ స్థానంలో హాజరైనట్లు హరీష్‌రావు చెప్పారు. అయినప్పటికీ అలా కుదరదని మంత్రి శ్రీధర్ బాబు తేల్చిచెప్పేశారు. దీంతో చేసేదేమీ లేక బీఏసీ సమావేశం మధ్యలో నుంచి హరీష్‌రావు బయటకు వచ్చేశారు.

**బీఏసీ మీటింగ్...** కాగా.. స్పీకర్ గడ్డం ప్రసాద్ అధ్యక్షతన జరుగుతున్న బీఏసీ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు హాజరయ్యారు. అలాగే బీఆర్ఎస్ నుంచి కడియం శ్రీహరి, బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి, ఎంఐఎం నుంచి బలాల, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు హాజరయ్యారు.

అసెంబ్లీ పనిదినాలు, ఎజెండాపై బీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com